


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 05 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 32 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపీ గవర్నర్‌తో ఇండోనేషియా కాన్సుల్ జనరల్ భేటీ

**రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై చర్చ**
**టోక్యో పారాలింపిక్స్ విజేతలను అభినందించిన గవర్నర్**



విజయవాడ: ఇండోనేషియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ అగస్ పి. సప్టోనో శనివారం రాజ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ను కలిశారు. మర్యాద పూర్వకంగా జరిగిన ఈ సమావేశంలో వీరిరువురు సమకాలీన అంశాలపై చర్చించారు. తొలుత రాజ్ భవన్‌కు విచ్చేసిన ఇండోనేషియా కాన్సుల్ జనరల్ (ముంబై) అగస్ పి. సప్టోనోకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండవ పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా సహజ వనరులతో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కలిగి ఉందని ఇండోనేషియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్‌కు వివరించారు. ఇక్కడి పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి ఇండోనేషియా నుంచి పెట్టుబడిదారులు రావచ్చని, రాష్ట్ర ప్రభుత్వం పలు రాయితీలను అందిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. గవర్నర్ హరిచందన్ ఇండోనేషియా కాన్సుల్ జనరల్ అగస్ పి. సప్టోనోను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. టోక్యో పారాలింపిక్స్‌లో మిక్స్‌డ్ 50 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో బంగారు పతక విజేత మనీష్ నర్వాల్ , రజత పతక విజేత సింఘ్రాజ్ అధనను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ అభినందించారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించిన అవని లేఖారాను అభినందించిన గవర్నర్ ఆమె ఇప్పటికే ఒక బంగారు పతకాన్ని సాధించారని ప్రశంసించారు. పారాలింపిక్ క్రీడల్లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచారని గవర్నర్ పేర్కొన్నారు. పురుషుల వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించిన హర్విందర్ సింగ్‌ను కూడా గవర్నర్ బిశ్వ భూషణ్ అభినందించారు. దేశ ప్రజలు వారి విజయాలను చూసి గర్వపడుతున్నారని, భవిష్యత్తులో దేశానికి మరిన్ని పురస్కారాలు అందించేదుకు కృషి చేయాలని గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ ఆకాంక్షించారు. ఈ మేరకు రాజ్ భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

## రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి



**సంక్షేమ పథకాల వలే పారిశ్రామిక రాయితీలకు క్యాలండర్ ప్రకటించి ఇస్తున్న రాష్ట్రం ఏపీనే**
**దీంతో దేశవ్యాప్తంగా పరిశ్రమల్లో రాష్ట్రంపై నమ్మకం పెరిగింది**
**కోవిడ్‌తో దేశంలో సగటున 30 శాతం ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయి**
**కానీ ఇక్కడ ప్రభుత్వ సాయంతో కష్టాన్ని తట్టుకొని నిలబడ్డాయి**
**ప్రోత్సాహకాలతో రాష్ట్రం టెక్స్‌టైల్ హబ్‌గా మారుతోంది**
**స్పిన్నింగ్ నుంచి గార్మెంట్స్ వరకు అనేక పెట్టుబడులు వస్తాయి**


అమరావతి: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా రెండో ఏడాది పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేయడంపై రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆర్థిక పరిస్థితులు బాగున్నప్పటికీ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు సకాలంలో అందించేవారు కాదని, కానీ సంక్షేమ పథకాలకు క్యాలండర్ ప్రకటించి నిధులు ఇస్తున్నట్లుగానే పరిశ్రమలకు ఇవ్వడం.. పరిశ్రమలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియచేస్తోందని పేర్కొంటున్నారు. కోవిడ్ కష్టకాలంలో నిధుల ఇబ్బంది ఉన్నప్పటికీ పారిశ్రామిక ప్రోత్సాహకాలు విడుదల చేయడం ద్వారా ఆయా సంస్థలు మూతపడకుండా నిలదొక్కుకోవడమే కాకుండా 12 లక్షల మంది జీవితాలకు భరోసా కల్పించినట్లయిందని చెబుతున్నారు. గతంలో వలే మూడునాలుగేళ్లు బకాయిలు పెట్టకుండా సకాలంలో రాయితీలు అందిస్తుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు ఆసక్తి చూపిస్తాయని, తద్వారా రాష్ట్రంలో పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశలు మెరుగుపడతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా రెండో ఏడాది కూడా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు విడుదల చేయడంపై వివిధ పారిశ్రామిక ప్రతినిధులు ఏమంటున్నారో.. వారి మాటల్లోనే.. ప్రోత్సాహకాలను సకాలంలో విడుదల చేయడం.. పరిశ్రమలకు ప్రభుత్వంపై నమ్మకం పెంచింది. కష్టకాలంలో ఎంఎస్ఎంఈలకు రూ.440 కోట్లు విడుదల చేయడం ద్వారా వారి వర్కింగ్ క్యాపిటల్ వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇదే సమయంలో స్పిన్నింగ్ మిల్లులకు రూ.684 కోట్లు విడుదల చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవకాశం ఏర్పడింది. వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచడం ద్వారా రాష్ట్రంలో వివిధ ఉత్పత్తులకు, సేవలకు, ఆర్థికవ్యవస్థ వృద్ధికి దోహదం చేస్తోంది. సీఎం జగన్‌కు సీఐఐ ఏపీ చాప్టర్ అభినందనలు తెలియజేస్తోంది. కోవిడ్‌తో ఆర్థిక కష్టాల్లో ఉన్న ఎంఎస్ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చేయూతనందించింది. ప్రోత్సాకాల రూపంలో పరిశ్రమలకు రూ.1,124 కోట్లు ఇవ్వడం ద్వారా చిన్న పారిశ్రామికవేత్తలతో పాటు పెద్ద పెట్టుబడిదారుని వరకు రాష్ట్రంపై నమ్మకాన్ని పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2020?23 పారిశ్రామిక పాలసీల్లో ఎంఎస్ఎంఈలకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక రాయితీలను ప్రకటించారు. కేంద్రం కూడా ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత ప్రోత్సహించేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చే విధంగా మేం చర్యలు తీసుకుంటున్నాం. గతంలో పరిశ్రమలు ప్రోత్సాహకాల కోసం కనీసం మూడు నాలుగేళ్లు ఎదురు చూడాల్సి వచ్చేది. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ బకాయిలను చెల్లించడమే కాకుండా వరుసగా రెండో ఏడాది కూడా సకాలంలో ప్రోత్సాహకాలను ఇచ్చింది. సంక్షేమ పథకాలకు క్యాలండర్ ప్రకటించినట్లుగానే ప్రోత్సాహకాలకు ముందుగానే తేదీని ప్రకటించడం పరిశ్రమల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచింది. 'వైఎస్సార్ నవోదయం' ద్వారా కష్టాల్లో ఉన్న అనేక పరిశ్రమలు నిలబడ్డాయి. సమయంలో రీస్టార్ట్ ప్యాకేజీ పేరుతో ప్రభుత్వం ఆదుకుంది. దేశవ్యాప్తంగా సగటున 30% చిన్న పరిశ్రమలు మూతపడినప్పటికీ ఇక్కడ కష్టకాలాన్ని తట్టుకుని నిలబడటానికి ఇది ఉపయోగపడింది.

## తాలిబన్ల ప్రభుత్వ ఏర్పాటు మళ్లీ వాయిదా

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రభుత్వ ఏర్పాటును వచ్చే వారానికి వాయిదా వేసినట్లు తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ శనివారం చెప్పారు. తాలిబన్ సహ వ్యవస్థాపకుడు ముల్లా అబ్దుల్ ఘనీ బరదర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడవచ్చునని, దీనికి సంబంధించిన ప్రకటన శనివారం వెలువడవచ్చునని అందరూ భావించిన సంగతి తెలిసిందే. తాలిబన్లు చెప్తున్నదాని ప్రకారం, అంతర్జాతీయ సమాజానికి ఆమోదయోగ్యంగా, అందరికీ భాగస్వామ్యం కల్పిస్తూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటువంటి ప్రభుత్వానికి ఓ రూపం ఇవ్వడంలో ఆలస్యమవుతోంది. తాలిబన్లు ఆగస్టు 15న ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఏర్పాటును వాయిదా వేసుకోవడం ఇది రెండోసారి. తాలిబన్ అధికార ప్రతినిధి ముజాహిద్ శనివారం మాట్లాడుతూ, ఆఫ్ఘనిస్థాన్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ సభ్యుల గురించి ప్రకటనను వచ్చే వారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. ఇతర వివరాలను ఆయన వెల్లడించలేదు. నూతన ప్రభుత్వ ఏర్పాటుపై వివిధ వర్గాలతో చర్చించేందుకు తాలిబన్లు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యుడు ఖలీల్ హక్కానీ మాట్లాడుతూ, ప్రపంచానికి ఆమోదయోగ్యమైన, విస్తృత స్థాయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామని, అందువల్ల జాప్యం జరుగుతోందని చెప్పారు. తాలిబన్లు తమంతట తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలరని, అయితే అది ప్రపంచానికి ఆమోదయోగ్యం కాదని చెప్పారు. అన్నిపార్టీలు, గ్రూపులు, సమాజంలోని అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండేవిధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త ప్రభుత్వంలో ఆఫ్ఘన్ మాజీ ప్రధాని, జమాతే ఇస్లామీ ఆఫ్ఘనిస్థాన్ చీఫ్ గుల్బుద్దీన్ హెక్మత్యార్‌కు స్థానం దక్కుతుందన్నారు. ఆఫ్ఘన్ మాజీ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ సోదరుడు తాలిబన్లకు మద్దతు ప్రకటించారని, ఆయనకు కూడా నూతన ప్రభుత్వంలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని తెలిపారు. ఇతర వర్గాల మద్దతు కూడగట్టేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా, భారత దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి ఇటీవల మాట్లాడుతూ, ఆఫ్ఘనిస్థాన్ గడ్డను భారత దేశంపై ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వాడుకోకుండా చూడటంపైనే తాము దృష్టి పెట్టామని చెప్పారు. తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించడం గురించి మాట్లాడటం చాలా త్వరపడటం అవుతుందన్నారు.

## 47 కార్పొరేషన్లకు 481 డైరెక్టర్ల నియామకం

అమరావతి: రాష్ట్రంలో 47 కార్పొరేషన్లకు 481 డైరెక్టర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్టర్ల వివరాలను శనివారం వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాల కృష్ణ, హోం మంత్రి మేకతోటి సుచరిత, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే మేరుగ నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకం ఊసే లేదన్నారు. రాజ్యసభ సీటు విషయంలో బాబు ఎస్సీలను అవమానించారన్నారు. చంద్రబాబు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంక్‌గానే చూశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా డైరెక్టర్ల నియమకంలోనూ పాల్గొని అన్ని వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. సామాజిక న్యాయం కార్పొరేషన్ల స్థాయిలో అమలయ్యే విధంగా తయారు చేశారన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీలకు 58 శాతం పదవులు ఇచ్చామన్నారు. మహిళలకు 52 శాతం అవకాశం కల్పించామన్నారు. ఓసీలకు 42 శాతం పదలిచ్చామని తెలిపారు. బలహీన వర్గాలను ముందుకు తీసుకురావడమే సీఎం జగన్ లక్ష్యమని సజ్జల అన్నారు. బీసీలంటే




చంద్రబాబుకు చులకన అని, వారిని ఓటు బ్యాంక్‌గానే చూశారని మంత్రి వేణుగోపాల కృష్ణ అన్నారు. బలహీన వర్గాలకు సీఎం జగన్ భరోసా కల్పించారన్నారు. సీఎంకు, సామాన్యుడికి మధ్యలో ఎవరూ లేరన్నారు. మహిళలకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారని హోంమంత్రి సుచరిత అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకంలో మహిళలకు 52 శాతం పదవులు ఇచ్చారన్నారు. 31 లక్షల ఇళ్ల పట్టాలన్నీ మహిళల పేరు మీదే ఇచ్చి వారి ప్రాధాన్యం ఏమిటో చెప్పారని సుచరిత అన్నారు. ఎమ్మెల్యే మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. బలహీనవర్గాల అభివృద్ధికి పాటుపడుతున్న నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్ల నిమామకంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. కొంతమంది కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన దాన్ని పదవి అనుకోకుండా బాధ్యతలా పని చేయాలన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే వారి పట్ల మనమంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీ పేర్కొన్నారు.

## సహకార వ్యవస్థను పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తాం: మంత్రి కన్నబాబు



తూర్పుగోదావరి: సహకార వ్యవస్థను పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా100 డీసీసీబీ బ్రాంచ్లను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులతో పాటుగా డ్వాక్రా సంఘాలకు సహకార రంగం ద్వారా ఋణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్రెడ్డి పోలవరం ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారని, ఆయన వారసునిగా పోలవరం పూర్తి చేయడానికి సీఎం జగన్ అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు వచ్చినా రాకపోయిన పర్వాలేదు.. కాంట్రాక్టులు తమకు వస్తే చాలన్న విధంగా ఆప్పుడు చంద్రబాబు వ్యవహరించారని మండిపడ్డారు.

## బెంగాల్ ఉప ఎన్నికలకు రంగం సిద్ధం!




కోల్‌కతా: టీఎంసీ అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ అసెంబ్లీ ఎన్నికకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. మమతా బెనర్జీ పోటీ చేయనున్న బెంగాల్‌లోని భవానీపూర్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో బీజేపీ, టీఎంసీ మధ్య కీలక పోరుకు తెరలేచింది. ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 6న జారీ చేయనున్నట్లు ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. సెప్టెంబరు 30న పోలింగ్, అక్టోబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపింది. బెంగాల్ రాష్ట్ర ప్రత్యేక అభ్యర్థన, రాజ్యాంగపరమైన అత్యవసర పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. బెంగాల్‌లో మమతాబెనర్జి బరిలో దిగాలని భావిస్తున్న భవానీపూర్ అసెంబ్లీ స్థానానికి సెప్టెంబర్ 30న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా బెంగాల్‌లోని షంషేర్‌గంజ్, జాంగీర్‌పూర్ అసెంబ్లీ స్థానాలకు, ఒడిశాలోని పిప్లీ అసెంబ్లీ స్థానానికి కూడా అదే తేదీన ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపింది. కోవిడ్ పరిస్థితుల దృష్ట్యా మిగిలిన నియోజకవర్గాల ఉప ఎన్నికలు వాయిదా వేసింది. సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత 31 అసెంబ్లీ నియోజకవర్గాలు, 3 పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఉప ఎన్నికలను వాయిదా వేస్తున్నటు వెల్లడించింది. కాగా ఈ ఏడాది ఏప్రిల్-మే జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మొత్తం 294 సీట్లలో 213 స్థానాలను కైవం చేసుకొని మమత నేతృత్వంలోని టీఎంసీ ఘన విజయం సాధించింది. అయితే నందీగ్రామ్ నుంచి బీజేపీ అభ్యర్థి సువేందు అధికారిపై సుమారు 2వేల ఓట్ల తేడాతో దీదీ ఓడిపోయినా, బెంగాల్ సీఎంగా మమత ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ భవానీపూర్ నియోజకవర్గం నుంచి పోరుకు సిద్ధమయ్యారు.

## సర్కారు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు రెట్టింపు

**గతంతో పోలిస్తే 100 శాతానికిపైగా అధికం**
**నాడు?నేడుతో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు కళకళ**
**ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగుపడుతున్న మౌలిక వసతులు**
**ప్రైవేట్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉత్తమ చికిత్సలే లక్ష్యం**

అమరావతి: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఆరోగ్యశ్రీ చికిత్సల కింద ప్రభుత్వ ఆస్పత్రులకు అందుతున్న నిధులు గణనీయంగా పెరుగుతున్నాయి. చక్కటి మౌలిక వసతులు, వైద్య సిబ్బంది సేవలు మెరుగ్గా అందుబాటులోకి రావడం వల్ల ఎక్కువ మంది రోగులు ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా సెకండరీ కేర్ ఆస్పత్రులైన వైద్య విధాన పరిషత్ పరిధిలోని సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు పెరగడం మంచి పరిణామంగా పేర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ నిధులు రెట్టింపు అయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017లో వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రులకు రూ.16.10 కోట్ల మేర ఆరోగ్యశ్రీ నిధులు అందగా 2020లో రూ.35.78 కోట్లు విడుదలయ్యాయి. 100 శాతానికిపైగా నిధుల పెరుగుదల కనిపించింది. ప్రస్తుతం సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో నాడు ? నేడు ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల కొత్త భవనాల నిర్మాణం జరుగుతోంది. ఇవన్నీ పూర్తయితే ఆరోగ్యశ్రీ చికిత్సలు మరిన్ని జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 60 శాతం ఆరోగ్యశ్రీ నిధులు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళుతున్నాయి. అదే ప్రభుత్వ పరిధిలో అన్ని ఆస్పత్రుల అభివృద్ధి జరిగితే ఆ మేరకు నిధులు ప్రభుత్వ ఆస్పత్రులకే అందే అవకాశం ఉంది. క్రమంగా ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులను పెంపొందించి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉత్తమ చికిత్సలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీపై అధికారులు దృష్టి సారిం చిన విషయం తెలిసిందే. 2020లో వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్‌ల ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటికే 232 మంది వైద్యులను శాశ్వత ప్రాతిపదికన నియమించారు. తిరిగి 2021లో 460 పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టారు.

## చంద్రబాబు హయాంలో ఏపీకి అన్యాయం: పురంధరేశ్వరి



విశాఖపట్నం: చంద్రబాబు హయాంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురంధరేశ్వరి మండిపడ్డారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, 2014లో అధికారం కట్టబెటితే జన్మభూమి కమిటీల అరాచకాలు పెరిగాయని.. రాజధాని పేరుతో చంద్రబాబు గ్రాఫిక్స్ చూపించారని ధ్వజమెత్తారు. అమరావతి రైతులను చంద్రబాబు అయోమయంలోకి నెట్టారన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 05 సెప్టెంబరు 2021

## గుది బండగా మారుతున్న గ్యాస్ బండ

సామాన్యులకు షాక్ మీద షాక్ తగులుతోంది. ఓవైపు పెట్రోల్, డీజిల్ ధరలు... మరోవైపు గ్యాస్ సిలిండర్ ధరలుపోటాపోటీగా పెరుగుతున్నాయి. గ్యాస్ సిలిండర్ ధర మరోసారి పెరిగింది. గ్యాస్ సిలిండర్ ధర రూ.1,000 వైపు పరుగులు తీస్తోంది. 15 రోజుల గ్యాప్‌లో గ్యాస్ సిలిండర్ ధర మళ్లీ పెరిగింది. ఆగస్ట్ రెండో వారం తర్వాత గ్యాస్ సిలిండర్ ధర రూ.25 పెరిగిన సంగతి తెలిసిందే. వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గ్యాస్ కంపెనీలు ప్రతి నెల ఎంతో కొంత పెంచడంతో సామాన్యుడికి నడ్డి విరిచినట్లవుతుంది. ఒక వైపు నిత్యవసర సరుకులతో ఇబ్బందులకు గురవుతున్న సామాన్య ప్రజలు.. పెట్రోల్, డీజిల్ ధరలతో మరింత భారం పడుతోంది. ఇక సిలిండర్ ధరలు కూడా పెరుగుతుండటంతో మరింత భారం మోపుతున్నట్లవుతుంది. ఈ కారణంగా పేదలు స్టౌమ్‌పై వంట చేసుకునేందుకు ఇబ్బందిగా మారిపోతుంది. గత ఏడాదిలో దేశీయ గ్యాస్ సిలిండర్ ధఱ రూ.265కు పెరిగింది. ఆగస్టు 17న సిలిండర్ ధరపై రూ.25 పెరిగింది. దీంతో 14.2 కిలోల సబ్సిడీ లేని గ్యాస్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 859.50, ముంబైలో రూ .859.50, కోల్‌కతాలో రూ .886, చెన్నైలో రూ .875.50. సరిగ్గా ఒక సంవత్సరం కిందట ఆగస్టు 1, 2020 న ఢిల్లీలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ .594 ఉండగా, కోల్‌కతాలో రూ .621, ముంబైలో రూ .594 మరియు చెన్నైలో రూ .610.50 ఉంది.ఈ ఏడాది గత ఎనిమిది నెలల్లో గ్యాస్ సిలిండర్ల ధర రూ .165 పెరిగింది. 31 డిసెంబర్ 2020 నాటికి గ్యాస్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ. 694 ఉండగా, కోల్‌కతాలో రూ. 720.50, ముంబైలో రూ. 694 మరియు చెన్నైలో రూ .710. కరోనా సమయంలో ప్రభుత్వం సబ్సిడీని గణనీయంగా తగ్గించింది. ధర చాలా పెరగడానికి కారణం ఇదే. ప్రస్తుతం, కొన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే సబ్సిడీ ప్రయోజనం అందుబాటులో ఉంది.2019-20 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఒఖఉ గ్యాస్ సిలిండర్లపై 29 వేల 627 కోట్ల రూపాయలను సబ్సిడీగా ఇచ్చింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 25,520 కోట్లకు తగ్గింది, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ .12,480 కోట్లు సబ్సిడీగా ప్రకటించబడింది.గ్యాస్ సిలిండర్ల ధర పెరుగుతున్న తీరును చూస్తే, ఉజ్వల పథకం ప్రయోజనం అసంపూర్తిగా ఉంటుందని కొందరు చెబుతున్నారు. ఈ పథకం మొదటి దశలో, 8.03 కోట్ల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, ప్రభుత్వం 1 కోటి ఉచిత కనెక్షన్లను పంపిణీ చేస్తుంది. ఉజ్వల స్కీమ్ 2.0 ని ఆగస్టు 10 న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రతి నెల 1వ తేదీన చమురు సంస్థలు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తూ ఉంటాయి. ఆగస్టు 1న వాణిజ్య సిలిండర్ ధరపై మాత్రమే పెరుగగా, 14.2 కిలోల సిలిండర్ ధరలో మార్పులు చేయలేదు. కానీ ఆగస్టు 17న మాత్రం మళ్లీ ధరలను పెంచాయి చమురు సంస్థలు.తాజాగా గ్యాస్ సిలిండర్ ధరను మరో రూ.25 పెంచాయి ఆయిల్ కంపెనీలు. నిన్నటివరకు హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.912 ఉండేది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్ కావాలంటే రూ.937 చెల్లించాలి. హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.1,000 కి చేరుకోవడానికి ఇంకో రూ.63 పెరిగితే చాలు. ఇక న్యూఢిల్లీలో గ్యాస్ సిలిండర్ ధర రూ.884.50 కి చేరుకుంది. డొమెస్టిక్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర మాత్రమే కాదు... కమర్షియల్ సిలిండర్ ధర కూడా పెరిగింది. 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.75 పెరగింది. దీంతో హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.1,872 కి చేరుకుంది. ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1693. కొన్ని నెలలుగా గ్యాస్ సిలిండర్ ధరలు వరుసగా పెరుగుతున్నాయి. కొన్ని రోజులు గ్యాప్ ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ ధర పెంచుతున్నాయి ఆయిల్ కంపెనీలు. ఒకే నెలలో రెండుసార్లు గ్యాస్ సిలిండర్ ధర పెంచిన సందర్భాలు ఉన్నాయి. ఆయిల్ కంపెనీలు ప్రతీ నెల ఒకటో తేదీన, రెండో వారం తర్వాత గ్యాస్ సిలిండర్ ధరల్ని సవరిస్తుంటాయి. ఆగస్ట్ 1న సిలిండర్ ధరలు పెంచలేదు. కానీ ఆగస్ట్ రెండోవారంలో సిలిండర్ ధర రూ.25 పెరిగింది,ఇక గతంలో పెరిగిన సిలిండర్ ధరల వివరాలు చూస్తే ఫిబ్రవరి 1న రూ.25, ఫిబ్రవరి 15న రూ.50, ఫిబ్రవరి 25న రూ.25, మార్చిలో రూ.25 చొప్పున సిలిండర్ ధర పెరిగింది. ఏప్రిల్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.10 తగ్గింది. జూలైలో రూ.25.5, ఆగస్టులో రూ.25 చొప్పున పెరిగింది.

# వైజాగ్ లో గంటా తులసీ బారిన పడితే అంతే

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)ఆమె మామూలు లేడీ కాదు.. మాయలేడీ..! క్షణాల్లో మాయచేసి దోచుకునే ఖతర్నాక్ కిలేడీ..! జైలుకెళ్ళినా.. శిక్షపడినా.. ఏమాత్రం బుద్ధి మారకుండా తన చోరకళకు పదును పెడుతూనే ఉంది. తాజాగా మళ్ళీ ఓ కేసులో అరెస్టై కటకటాలపాలైంది. పేరు గంటా తులసి. ఊరు.. విజయనగరం జిల్లా కొత్తవలసలోని 202 కాలనీ. వృత్తి చోరీలు.! ఒక్కోసారి సింగిల్‌గానూ.. మరికొన్ని సార్లు ఓ గ్రూప్‌గాను వెళ్తుంది. స్కెచ్ వేసిందంటే.. పని అయిపోయినట్టే..! ఒంటరి మహిళలు, అమాయకులే ఆమె టార్గెట్. 202 కాలనీ నుంచి కొత్తవలసమీదుగా కొంతమందితో విశాఖ జిల్లాలో నిత్యం ఎంటరైపోతూ ఉంటుంది ఈ కి'లేడీ'. కనిపించిన వారిని మాయచేసి మభ్యపెట్టి పాకెట్ గుల్ల చేసేస్తోంది. ఒక్కో సమయంలో ఒంటరిగానూ.. కొన్ని సందర్భాల్లో తన బ్యాచ్‌తో ఈ నేరాలకు చేస్తూ ఉంటుంది. ఈమె టార్గెంట్ చేస్తోంది ఓన్లీ ప్రయాణికులకే..! సింగిల్‌గా వెళ్ళినప్పుడు ఓ ప్రయాణికురాలిగా ఆటోలో ఎక్కుతుంది. పెందుర్తినుంచి గోపాలపట్నం వరకు నిత్యం ప్రయాణం చేస్తూ ఉంటుంది. తన పక్కనే ఎవరైనా ఎక్కి కూర్చుకున్నారో.. వారి జేబు గుల్లైపోయినట్టే..! ఇక.. మరికొన్ని సందర్భాల్లో అయితే.. ఎవరికీ అనుమానం రాకుండా ఓ బ్యాచ్‌నే సెట్ చేస్తుంది. తానొక ప్రయాణికురాలిగా నటిస్తూ.. ఆటో డ్రైవర్‌తో పాటు.. మరో మహిళను కూడా తనతో పాటు తీసుకెళ్తుంది. అంతేకాదు? కొన్ని సందర్భాల్లో ఓ చిన్న బేబీని కూడా తమతో పాటు తీసుకెళ్తుంది. కొంతదూరం వెళ్ళాక.. వీరి స్కెచ్ మొదలవుతుంది. బ్యాచ్‌కు గంటా తులసి టోటల్ డైరెక్షన్ ఇస్తుంది. ప్లాన్‌లో భాగంగా ఒంటరి మహిళలనే ఈ బ్యాచ్ టార్గెట్ చేస్తుంది. తులసి చెప్పిన డైరెక్షన్‌తో ఆటో డ్రైవర్.. రోడ్డుపై ఆటోలకోసం వేచిచూసే సింగిల్ లేడీస్ దగ్గరకు తీసుకెళ్లి ఆపుతాడు. ఆమె ఎక్కడికంటే అక్కడికి కాస్త తక్కువకైనా బేరం ఒప్పించి ఎక్కించేస్తారు. అప్పుడు వీరి పని మొదలవుతుంది. కొంతదూరం వెళ్ళాక.. మరో మహిళ ఒడిలో ఉన్న బేబీకి వీళ్ళే గిల్లుతారు. బేబీ ఏడ్చిన వెంటనే.. వారితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు ఆ బేబీ వైపు డైవర్ట్ అవుతోంది. ఇంతలో.. మరోవైపున్న గంటా తులసి.. ఆ ప్రయాణికులరాలు బ్యాగును గుల్ల చేసేస్తోంది.కొన్ని సందర్భాల్లో సింగిల్‌గా కూడా అఫెన్స్‌లు చేస్తూ ఉంటుంది ఈ గంటా తులసి. తాజాగా గత నెల 26న చినముషిడివాడకు చెందిన కె దేవి అనే మహిళ.. నక్లెస్ మరమ్మత్తులు చేయించుకుని తిరిగి వెళ్తోంది. గోపాలపట్నం నుంచి పెందుర్తి వెళ్లేందుకు ఆటో ఎక్కింది దేవి. పెందుర్తి ఆటో దిగిన తరువాత పదిహేను గ్రాముల బంగారు నెక్లెస్ మాయమైనట్టు గుర్తించి ఉలిక్కిపడింది. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం అందించింది. రంగంలోకి దిగిన పోలీసులు.. ఇటువంటి నేరాలకు పాల్పడే నేరస్థులపై కన్నేశారు. వారిని వెరిఫై చేసి.. దేవి నక్లెస్ కాజేసింది గంటా తులసేనని నిర్ధారించారు. తులసిని అరెస్ట్ చేసి కటకటాల వెనక్కునెట్టారు క్రైం పోలీసులు.గంటా తులసి.. గతంలోనూ దాదాపు 20కి పైగా కేసుల్లో నిందితురాలుగా ఉంది. చాలా సార్లు జైలుకెళ్ళింది. కొన్ని కేసుల్లో ఆమెకు శిక్షకూడా ఖరారైంది. అయినా.. ఆమె తన బుద్ధి మార్చుకోలేదు. మళ్ళీ ఇప్పుడు చోరీ కేసులో పోలీసులకు చిక్కి కటకటాల పాలైందని క్రైం డీసీపీ సురేష్‌బాబు తెలిపారు. అయితే.. ఈసారి మాత్రం పోలీసులు ఈమెపై డీసీ షీట్ ఓపెన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# ప్రత్యక్ష రాజకీయాల్లోకి వైవీ అడుగులు..?

రాజమండ్రి, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రూట్ మార్చారు. మొదటి విడతలో ఓన్లీ తిరుమల మీదే దృష్టి పెట్టిన వైవీ రెండోదఫా ప్రత్యక్ష రాజకీయాల మీద ఫోకస్ పెట్టారు. రాజ్యసభకో లేక ఎమ్మెల్సీ అయ్యి రాష్ట్ర కేబినెట్‌లోకి వద్దాం అనుకున్న వైవీని.. మళ్లీ టీటీడీకే పంపారు సీఎం జగన్. దీంతో.. అటు స్వామి కార్యం.. ఇటు స్వకార్యం అన్నట్టు రెంటినీ నడపాలని డిసైడ్ అయ్యారట వైవీ. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ ఛైర్మన్‌గా వైవీని నియమించారు. రెడ్డి సామాజికవర్గమే అయినా.. ఆయన ఆచార వ్యవహారాలు, దైవభక్తి విషయంలో జంధ్యం వేసుకొని బ్రాహ్మణుడిలా ఉంటాయని చెబుతారు. టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కొత్తలో వైవీకి క్రిస్టియన్ ముద్ర వేయడానికి చూశాయి విపక్షాలు. ఆ సమయంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి.. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను, భక్తి, ఆచారాలు పాటించడంలో వైవీ తనను మించిన బ్రాహ్మణుడిగా కొనియాడారు. చిన్నప్పటి నుంచి వైవీని దగ్గర నుంచి చూడటం వల్లే సీఎం జగన్.. ఆయనకు టీటీడీ ఛైర్మన్ పదవి కట్టబెట్టారని అనుకున్నారు. మొదటి టర్మ్ పదవీకాలం పూర్తయినా.. తిరిగి రెండోసారి అదే పదవిలో ఆయన్ని కూర్చోబెట్టారని అభిప్రాయపడుతున్నారు పార్టీ నేతలు.టీటీడీ ఛైర్మన్‌గా మొదటి టర్మ్‌లో ఎక్కువగా తిరుమల శ్రీవారి సేవలోనే తన్మయం చెందారు వైవీ. ఆ సమయంలోనూ ఉభయగోదావరి జిల్లాల వైసీపీ ఇంఛార్జ్‌గా ఉన్నప్పటికీ చుట్టం చూపుగా వచ్చి వెళ్లేవారు. టీటీడీ ఛైర్మన్‌గా రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని చూశారు. అధిష్ఠానం మాత్రం టీటీడీ ఛైర్మన్‌గా రెండోసారి ఆయనకే ఇచ్చింది. దీంతో అయిష్టంగానే మళ్లీ టీటీడీ ఛైర్మన్ పదవి చేపట్టారాయన. నామినేటెడ్ పదవిలో ఉంటే ప్రత్యక్ష రాజకీయాలకు దూరం అయిపోతామని అనుకున్నారో ఏమో.. సుబ్బారెడ్డి రూటు మార్చారు. ఇప్పుడు టీటీడీతోపాటు.. పార్టీ ఇంఛార్జ్‌గా ఉభయ గోదావరి జిల్లాలపై ఫోకస్ పెట్టారు. ఈ మధ్య తరచూ గోదావరి జిల్లాల పర్యటనకు వెళ్తున్నారు. ఏ చిన్న కార్యక్రమం ఉన్నా వచ్చి పాల్గొని కార్యకర్తల్లో జోష్ నింపుతున్నారు. ఇటీవల కరోనాతో చనిపోయిన నేతల ఇంటికి వెళ్లి మరీ పరామర్శించారు.

కొత్తగా కార్పొరేషన్ ఛైర్మన్‌లు అయిన వారి ప్రమాణస్వీకారోత్సవాలకు హాజరయ్యారు వైవీ.ఉభయగోదావరి జిల్లాల్లోని రాజమండ్రి, ఉండి నియోజకవర్గాలతోపాటు పలు ప్రాంతాల్లో వైసీపీలో నెలకొన్న వర్గ విభేదాలను పరిష్కరిస్తూ అందరినీ ఏకతాటిపైకి తెస్తున్నారు వైవీ. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టి, ఆ పీఠంపై వైసీపీ కార్పొరేటర్‌ను కూర్చోబెట్టాలని చూస్తున్నారు. రానున్న రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని కైవశం చేసుకుని టీడీపీ కంచుకోటలో వైసీపీ జెండా ఎగరేయడానికి నేతలతో వ్యూహ రచన చేస్తున్నారు. రాజమండ్రిలోని వైసీపీ నేతలతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి సమన్వయంతో నడిపిస్తున్నారు వైవీ. ఈ విధంగా సుబ్బారెడ్డి పార్టీపై ఫోకస్ పెట్టడంతో కొందరు నేతలు పార్టీలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకొనే అవకాశం కలుగుతోందని సంబర పడుతున్నారట. అందుకే వైవీ సుబ్బారెడ్డి స్వామి కార్యంతోపాటు.. స్వకార్యంలోనూ బిజీ అయ్యారని చెవులు కొరుక్కుంటున్నాయి పార్టీ వర్గాలు.

# టీడీపీ... వైసీపీ

## నలిగిపోతున్న పోలీసులు



తిరుపతి, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)ఖాకీలకు కొన్ని పోలీస్ స్టేషన్లపై సెంటిమెంట్ ఎక్కువ. కలిసి వస్తుంది అనుకుంటే.. పోస్టింగ్‌ల కోసం ఓ రేంజ్‌లో పైరవీలు చేస్తారు. అదే రివర్స్‌లో ఉంటే పోలీస్ స్టేషన్ పేరు చెబితేనే హడలెత్తిపోతారు. ప్రస్తుతం ఆ ఖా గురించి అదే చర్చ జరుగుతోంది. మాకొద్దీ తలనొప్పి అని విసుగెత్తిపోతున్నారట అధికారులు. వైసీపీ, టీడీపీ మధ్యలో పోలీస్‌గా చర్చల్లో ఉన్న ఆ కథేంటో ఈ స్టోరీలో చూద్దాం.చిత్తూరు జిల్లా చంద్రగిరి. పోలీస్‌శాఖ పరంగా సమస్యాత్మక ప్రాంతం. అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఎక్కడ అలజడి రేగిన ఇంఛార్జ్ అధికారులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. డీఎస్పీ కోసం ఎదురు చూడక తప్పడం లేదు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత మండలంలోనే ఈ పీఎస్ ఉంది. ప్రస్తుతం అధికారులు లేక స్టేషన్ ఖాళీ.చంద్రగిరి మండల పరిధిలో రెండు జాతీయ రహదారులు, స్వర్ణముఖి, భీమా నదులు, రాయలవారి కోట, శ్రీనివాసమంగాపురం, శేషాచల అడవులు, శ్రీవారిమెట్టు ప్రాంతాలు ఉన్నాయి. శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే వీఐపీల తాకిడి ఎక్కువ. పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారి 16 కిలోమీటర్లు చంద్రగిరిలో కలుస్తుంది. ఈ హైవేలో రోడ్డు ప్రమాదాలూ ఎక్కువే. తిరుపతి, మదనపల్లి జాతీయ రహదారి 15 కిలోమీటర్లు ఈ మండలంలోనే ఉంది. ఈ హైవేలోనే భాకరాపేట ఘాట్ రోడ్డు కూడా ఉంది. ఇసుక, గ్రావెల్, ఎర్రచందనం మాఫియాల గురించి ఎంత చెప్పినా తక్కువే. కానీ చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఆ పని ఒత్తిడికి తగ్గట్టు మెన్ ఉండటం లేదు. దీంతో పని ఒత్తిడికి అధికారులు అక్కడ పోస్టింగ్ అంటేనే భయపడే పరిస్థితి.చంద్రగిరి పిఎస్ పరిధిలోనే పొలిటికల్ పార్టీల సభలు, సమావేశాలు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలతో ఎప్పుడూ హాట్ హాట్‌గా ఉంటుంది. మాజీ సీఎం చంద్రబాబు నివాసం ఉండేది ఈ పీఎస్ పరిధిలోనే. దీంతో వైసీపీ, టీడీపీ నేతల మధ్య రాజకీయ గొడవలు కామన్. ఇవి పోలీస్ స్టేసన్‌కు చేరితే పోలీసులు చెప్పింది వినరు.. పైగా ఖాకీలకు వార్నింగ్‌లు వెళ్తుంటాయి. దీంతో అడకత్తెరలో పోక చక్కలా మారింది పోలీసుల పరిస్థితి. అటు చెప్తే వాళ్లకు కోపం.. ఇటు చెప్పతే వీళ్లకు కోపం అన్నట్టు అయ్యింది. దీంతో మాకొద్దు బాబు ఈ స్టేషన్ అంటున్నారట. సహజంగా హైవేల పరిధిలో ఉన్న స్టేషన్లలో పోస్టింగ్‌లకు బాగా గిరాకీ ఉంటుంది. కానీ ఇక్కడ హైవే ఉన్న.. పొలిటికల్ దెబ్బలకు పోలీసులు పారిపోతున్నారు.ఆ మధ్య జరిగిన పంచాయితీ ఎన్నికలే దీనికి నిదర్శనం. రాజకీయ గొడవలు పీక్‌కు వెళ్లడంతో 2 నెలలుగా ఎస్ఐలు లేరు. మెడికల్ లీవ్‌లో వెళ్లిన సీఐ తిరిగి రాలేదు. కేసులు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. బాధితులు వస్తే తిప్పి పంపేస్తున్నారు కానిస్టేబుళ్లు. పదిరోజుల క్రితం ఇంఛార్జ్‌గా వచ్చిన ఓ సిఐ శ్రీకాళహస్తిలో పోస్టింగ్ రావడంతో వెళ్లిపోయారు. మరో ఇంఛార్జ సీఐ ఉన్నా వీలు చూసుకుని విధులకు హాజరుకావడంతో బాధితులు తలలు పట్టుకుంటున్నారు. కేసుల పరిష్కారానికి డీఎస్పీ కోసం రోజూ ఎదురుచూడాల్సిన పరిస్థితి. మరి.. చంద్రగిరి పోలీస్ స్టేషన్ పొలిటికల్ కౌగిలి నుంచి ఎప్పుడు బయటపడుతుందో చూడాలి.

# వరప్రసాద్ స్థానంలో కళ్యాణ చక్రవర్తి..?

నెల్లూరు, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాలోని ఎస్సీ నియోజకవర్గం గూడూరు. ఇక్కడ వైసీపీ నాయకుడు మాజీ ఐఏఎస్ అధికారి వరప్రసాద్ గత ఎన్నికల్లో విజయం దక్కించుకున్నారు. అయితే.. ఆయన పార్టీలో నేతలను.. మంత్రులను కూడా లెక్కచేయడం లేదనే విమర్శలు కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. దీనికితోడు.. ఆయన ప్రతిపనికీ కమిషన్ అడుగుతున్నారని.. ఎన్నికల సమయంలో తాను ఖర్చు చేశానని.. మొహం మీదే చెబుతున్నారట. ఆఖరుకు వైసీపీ నేతలకు పనులు చేసిపెట్టాలన్నా కూడా వరప్రసాద్.. ఇదే వైఖరి అవలంబిస్తుండడంతో నేతలు ఆయనను దూరం పెట్టారు. పార్టీ అధిష్టానం కూడా వరప్రసాద్‌ను పట్టించుకోవడం లేదు.ఇదిలావుంటే.. తిరుపతి పార్లమెంటు స్థానం నుంచి గత ఎన్నికల్లో విజయం దక్కించుకుని హఠాన్మరణం చెందిన బల్లి దుర్గా ప్రసాద్ తనయుడు కళ్యాణ్ చక్రవర్తిని.. కొందరు వైసీపీ సీనియర్లు.. గూడూరులో ట్రై చేయొచ్చుగా..! అని సలహాలు ఇస్తున్నారు. ప్రస్తుతం ఆయనకు జగన్ ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చి మండలికి పంపించారు. అయితే.. కేంద్రం కనుక మండలిని రద్దు చేస్తే.. తన భవితవ్యం ఏంటనేది.. చక్రవర్తికి కూడా దిగులుగా ఉంది. దీనికితోడు.. వరప్రసాద్‌పై వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో వైసీపీలో కీలక నేతలు.. ఇప్పుడు చక్రవర్తిని గూడూరు వైపు నడిపిస్తున్నారట. వచ్చే ఎన్నికల్లో టికెట్ నీకే దక్కుతుంది.. ఇప్పటి నుంచే నువ్వు కష్టపడు అని చెబుతున్నారట.దీంతో కళ్యాణ్ చక్రవర్తి.. కొన్ని రోజులుగా గూడూరులో పర్యటిస్తున్నారు. ఇక్కడ నుంచి గతంలో బల్లి దుర్గా ప్రసాద్.. టీడీపీ తరఫున నాలుగు సార్లు విజయం దక్కించుకుని అసెంబ్లీలో వాణిని వినిపించారు. 1985, 1994, 1999, 2009లోనూ దుర్గా ప్రసాద్ ఇక్కడ విజయం దక్కించుకున్నారు.

ఈ క్రమంలో ఆయనకు సన్నిహితులు, మిత్రులతోపాటు.. సానుభూతి పరులు కూడా ఉన్నారు. ఇక్కడ బల్లి ఫ్యామిలీకి బలమైన అనుచరగణం ఉంది. పైగా బల్లి నివాసం ఉండేది కూడా గూడూరులోనే.దీంతో కళ్యాణ్ చక్రవర్తి కనుక ఇక్కడ నిలబడితే.. గెలుపు గుర్రం ఎక్కడం ఈజీయేనని వైసీపీ నాయకులు కూడా చెబుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్ టార్గెట్‌గానే కొందరు రెడ్డి వర్గం నేతలు కళ్యాణ్‌ను ముందు పెట్టి ఈ రాజకీయం చేస్తున్నారట. వచ్చే ఎన్నికల్లో ఎలానూ.. యువతకు ఎక్కువ టికెట్లు ఇచ్చే ఉద్దేశంతో ఉన్న జగన్.. చక్రవర్తికి దీనిని కేటాయించే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో చక్రవర్తి ఇప్పటి నుంచే దీనిపై దృష్టి పెడుతున్నట్టు సమాచారం.

# విజిలెన్స్ విచారణ వేగం

విశాఖపట్టణం, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)అన్యాక్రాంతం అయిన సింహాచలం భూములపై ప్రభుత్వం దూకుడు పెంచింది. బాధ్యులైన సూత్రధారులు, పాత్రధారుల లెక్కలు బయటపెట్టేందుకు విజిలెన్స్ విచారణ వేగవంతం అయ్యింది. 2016-2017లో దేవస్థానం ఆస్తుల జాబితా నుంచి 862 ఎకరాలు తొలగించినట్లు దేవాదాయశాఖ త్రిసభ్య కమిటీ గుర్తించి నివేదిక ఇచ్చింది. ఈ రిపోర్ట్ ఆధారంగా ప్రాప ర్టీ రిజిస్టర్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన భూముల విలువ బహిరంగ మార్కెట్లో 10వేల కోట్ల రూపాయలనేది ఓ వాదన. దీంతో దేవుడి సొమ్మును కొల్లగొట్టిన వా రిని ఆధారాలతో సహా పట్టించాలనే పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే 862ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో క్రయ విక్రయాలు జరిపే వీలు లేదు. ఇప్పటికే ఈ భూములు చేతులు మారిపోగా? చాలా అపార్ట్ మెంట్లు, భవనాలు, లే అవుట్లు పుట్టుకొచ్చాయి.బీఆర్టీఎస్‌కు ఆను కుని సింహాచలం, వేపగుంట ప్రాంతాల్లో కొత్తకొత్త అపార్ట్ మెంట్లు నిర్మాణం కాగా? వీటిలో చాలా భాగం దేవస్థానం భూముల వివాదంలో ఉన్నాయి. ఇక్కడ అమ్మకాలు, కొనుగోళ్లు చేసేప్పుడు జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవంటున్నారు అధికారులు. సింహచలం దేవస్థానానికి చెందిన భూములు ప్రాపర్టీ రిజిస్టర్ నుంచి తొలగించారనేది నిర్ధారణ అయింది. అయితే వీటిని ఎందుకు, ఎవరికి కేటాయించారనేది లెక్క తేలాల్సి ఉంది. అదే సమయంలో అధికార పరిధిని దాటి అప్పటి ఈవో రామ చంద్ర మోహన్, అసిస్టెంట్ కమిషనర్ సుజాత పనిచేశారని తేలడంతో వేటు వేసింది ప్రభుత్వం. విజిలెన్స్ విచారణలో మరింత మంది బండారం బయటపడే అవకాశం ఉంది. ఇదే సమయంలో 862 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం అక్రమార్కులకు కునుకు లేకుండా చేస్తోంది.

# నాలుగు శాఖలపై వేటు తప్పదా...

విజయవాడ, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)ఏపీ కేబినెట్ ప్రక్షాళనపై అనేక ఊహాగానాలు హల్చల్ చేస్తున్నాయి. ప్రధాన మీడియాలో సైతం మరింత విడ్డూరంగా కథనాలు వస్తున్నాయి. జగన్ తన కేబినెట్‌ను పూర్తిగా మార్చేస్తారని.. తాను తప్ప మిగిలిన 25 మంది మంత్రులను ఆయన ఇంటికే పంపేస్తారని.. అందరినీ కొత్తవారిని తీసుకుంటారని.. కథనాలు రాస్తున్నారు. అయితే.. వాస్తవం ఏంటి ? నిజంగానే జగన్ అందరినీ పంపేస్తారా ? కొత్త ముఖాలకే అవకాశం ఇస్తారా ? ఇదే జరిగితే.. అత్యంత కీలకమైన రెండున్నరేళ్ల పాలనలో ఇబ్బందులు వస్తే.. ఎలా తట్టుకుంటారు ? అనే ప్రశ్నలు తెరమీదికి వస్తున్నాయి. దీనికి కొన్ని రీజన్లు కనిపిస్తున్నాయి. ఎలా అంటే.. జగన్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో కొందరు మంత్రులు కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో మంత్రులు చేసిన పనులను తాము అర్థం చేసుకునేందుకు ఆరు మాసాల సమయం పట్టిందని.. కాబట్టి కొన్ని శాఖలు క్రియా శీలం అయ్యేందుకు సమయం పడుతుందని వ్యాఖ్యానించారు. అవి కూడా కీలకమైన ఆర్థిక, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖలు కావడం గమనార్హం. ఇవి ప్రభుత్వానికి అత్యంత కీలకమైన శాఖలుగా చెబుతారు. ఎందుకంటే.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం అంతా ఈ నాలుగు శాఖలపైనే ఉంటుంది.సో.. ఈ శాఖలకు చెందిన మంత్రులను కూడా ఆచి తూచి ఎంచుకోవడం కనిపిస్తుంది. గతంలో చంద్రబాబు కూడా ఈ నాలుగు శాఖల మంత్రులను సీనియర్లనే నియమించారు. ఇప్పుడు జగన్ కూడా వీటిని.. సీనియర్లకే అప్పగించారు. ఆర్థిక మంత్రిగా.. బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూ మంత్రిగా ధర్మాన కృష్ణదాస్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పురపాలక మంత్రిగా సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణకు అప్పగించారు. మిగిలిన శాఖల పనితీరు ఎలా ఉన్నప్పటికీ.. ఈ నాలుగే ప్రభుత్వానికి కీలకం. కానీ, ఇప్పుడు జగన్ అందరినీ మార్చేస్తారని.. కొత్త ముఖాలకు మంత్రి పదవులు అప్పగిస్తారని.. జరుగుతున్న ప్రచారంలో పసలేదని అంటున్నారు పరిశీలకులు.ఎందుకంటే? వచ్చే రెండున్నరేళ్లు కూడా.. అత్యంత కీలకం.. ఈ సమయంలో ప్రయోగాలు చేసేందుకు ఏ ప్రభుత్వం కూడా సాహసం చేయదు. ఒకవేళ మంత్రివర్గాన్ని మార్చాలని అనుకున్నా.. కొన్ని కీలకమైన శాఖల మంత్రులను మార్చేందుకు ఇష్టపడరు. కొత్తవారు వచ్చి.. పనిప్రారంభించేసరికి.. పుణ్యకాలం గడిచి పోవడం ఖాయం. సో.. ముందు తాను చెప్పినట్టే.. జగన్.. 90 శాతం మందిని కూడా కాదు సగం మంది మంత్రులను మాత్రమే మారుస్తారంటున్నారు. పైగా..వచ్చే ఎన్నికలు కీలకం కావడంతో అప్పులు తెచ్చేవారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించేవారు జగన్‌కు అవసరం. అందుకే ఇప్పుడు కేబినెట్లో ఉన్న వారిలో మరీ 80-90 శాతం మార్పులు ఉండే పరిస్థితి లేదు.

# అన్నదమ్ముళ్లు... వారసులను దింపేస్తున్నారే

శ్రీకాకుళం, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)తండ్రుల రాజకీయ దీపాలు అలా వెలుగుతూ ఉండగానే తనయులు కూడా కళకళలాడాలని తెగ ఆశపడుతున్నారు. దానికి తండ్రుల నుంచి వస్తున్న మద్దతుతో తెగ దూకుడు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రాజకీయల విషయానికి వస్తే ధర్మాన ఫ్యామిలీకి పొలిటికల్ గా మంచి పేరు ఉంది. అంతే కాదు, గత కొన్ని పర్యాయాలుగా అన్నదమ్ములు ఇద్దరూ శాసనసభలో కనిపిస్తున్నారు. ఇక తాజా అసెంబ్లీలో ధర్మాన క్రిష్ణ దాస్ డిప్యూటీ సీఎంగా ఉంటే సీనియర్ ఎమ్మెల్యేగా ప్రసాదరావు ఉన్నారు. ఇక వీరి వారసులు కూడా శ్రీకాకుళం జిల్లాలో స్పీడ్ బాగా పెంచేశారు.ధర్మాన ప్రసాదరావు ఇపుడు పెద్దగా యాక్టివ్ గా లేరు అని అంటున్నారు. కానీ ఆయన రాజకీయమే వేరు. తాను తిరగాల్సిన చోట తనయుడు రామ్ మనోహర్ నాయుడుకి తిప్పుతున్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీకాకుళం మొత్తం రాజకీయాన్ని తనయుడి చేతిలో పెట్టేశారు తొందరలో శ్రీకాకుళం కార్పోరేషన్ కి ఎన్నికలు జరగబోతున్నాయి. అయితే ఈ ఎన్నికలలో మేయర్ గా తన కుమారుడిని నిలబెట్టి గెలిపించుకోవాలని తెర వెనక ప్రసాదరావు పావులు కదుపుతున్నారు. ఇది సొంత పార్టీలోని వారికే షాక్ ఇచ్చే పరిణామంగా ఉంది.మరో వైపు జెడ్పీ చైర్మన్ మహిళా రిజర్వేషన్ అయింది. అయితే రెండు వైస్ చైర్మన్ పదవులు వస్తాయి. అందులో ఒకటి తన తనయుడుకి ఇప్పటికే రిజర్వ్ చేయించి పెట్టేశారు ధర్మాన కృష్ణ దాస్. అంటే జిల్లా పెత్తనం తన కుమారుడి ద్వారానే చేయాలని ఆయన ఉబలాటపడుతున్నట్లుగా అర్ధమవుతోంది. దీని కోసం నరసన్న పేట నుంచి జెడ్పీటీసీగా కూడా డాక్టర్ క్రిష్ణ చైతన్య పోటీ చేశారు. ఈ ఫలితాలు వచ్చాక ఆయన వైఎస్ చైర్మన్ కావడం లాంఛనమే అంటున్నారు. ఆ విధంగా కొడుకుకి అధికార పదవి అప్పచెప్పి భావి వారసుడిగా తీర్చిదిద్దాలని క్రిష్ణ దాస్ భావిస్తున్నారు.ఇప్పటికే ఎర్రన్నాయుడు కుమారుడు గా రామ్మోహన్ నాయుడు ఎంపీ అయి చక్రం తిప్పుతున్నారు. త్వరలో అచ్చెన్నాయుడు వారసుడు కూడా రాజకీయాల్లోకి వస్తారని అంటున్నారు. ఇక స్పీకర్ తమ్మినేని సీతారామ్ వారసుడు చిరంజీవి నాగ్ కూడా రేసులో ఉన్నారు. దీంతో భవిష్యత్తులో కూడా సిక్కోలు రాజకీయం అంతా కూడా ఈ మూడు బడా ఫ్యామిలీల మధ్యనే తిరుగుతుంది అంటున్నారు. ఈ పరిణామాలతో వైసీపీ, టీడీపీలలో ఆశావహులు మాత్రం ఖంగు తింటున్నారు. అన్ని పదవులూ పెద్ద కుటుంబాలకే పోతే తమ సంగతేంటని వారు మండిపడుతున్నారు. కానీ రాజకీయం వారసత్వం పెనవేసుకుని పోయిన నేపథ్యంలో ఇది అనివార్యమే అంటున్నారు.

# ఏపీ బీజేపీ దిక్కుగా కిషన్ రెడ్డి



విజయవాడ, సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)ఏపీ బీజేపీ అన్నది ఉనికి కోసం పోరాడుతోంది. జనాల సమస్యలు ఒక వైపు ఉంటే పార్టీ పోరాటాలు మరో వైపు అన్న మాట కూడా ఉంది. జనాలు పెట్రోల్ వాతలతో తిప్పలు పడుతూంటే బీజేపీ నేతలు తాపీగా టిప్పు సుల్తాన్ చరిత్రను వల్లెవేసి ఆయన దేశ ద్రోహి అని నినదిస్తారు. ఇక స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మీద అంతా గుర్రుమీద ఉంటే గోవధ నిషేధాన్ని అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తారు. ఇలా రైమింగ్, టైమింగ్ మిస్ అవుతూ ఏపీ బీజేపీ తన రూట్ సెపరేట్ అంటోంది.ఇక ఏపీ బీజేపీలో నాయకులు ఎక్కువ. క్యాడర్ తక్కువ అన్న సెటైర్ కూడా ఉంది. ఈ ఉన్న నాయకులలో కూడా ముప్పై మూడు గ్రూపులు ఉన్నాయని చెప్పాలి. కేంద్ర మాజీ మంత్రి పురంధేశ్వరి ఒక వైపు ఉంటే సుజనా చౌదరి, మాజీ టీడీపీ బ్యాచ్ మరో వైపు ఉంటారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మరో విధంగా రెస్పాండ్ అవుతూంటే ఢిల్లీ పెద్దలతో టచ్ లో ఉండే ఎంపీ జీవీఎల్ నరసింహారావు స్టైల్ వేరుగా ఉంటుంది. ఇక ఆరెస్సెస్ నుంచి పార్టీలో ఉన్న సోము వీర్రాజు దూకుడే వేరు అని చెప్పాల్సిన పని లేదు. మరి వీరంతా కలుస్తారా, ఒకే మాట మీద ఉంటారా అన్నది కమలం పార్టీ కార్యకర్తలకే అర్ధం కాదు.ఇక ఉమ్మడి ఏపీలో బీజేపీకి ప్రెసిడెంట్ గా చాలా కాలం పనిచేసిన జి కిషన్ రెడ్డి ఏపీలో పార్టీ మంచీ చెడ్డా బాగా తెలుసు. ఆయనకు నాయకులు అందరూ పరిచయమే. యువజన నాయకుడిగా బీజేపీలో పనిచేసిన ఆయన ఇపుడు ఏపీ బాధ్యతలను కూడా చూడబోతున్నారు అంటున్నారు. తెలంగాణా నుంచి కేంద్ర మంత్రి అయిన కిషన్ రెడ్డి క్యాబినెట్ ర్యాంక్ హోదాలో ఏపీకి తొలిసారి వస్తున్నారు. ఆయన ఆగస్ట్ నెలలో ఏపీలో పర్యటిస్తారు అంటున్నారు. ఆయన తన పర్యటనలో విశాఖకు కూడా వెళ్తారని చెబుతున్నారు. ఆయన ఏపీ బీజేపీ నాయకులు అందరితోనూ సమావేశమై పార్టీ భవిష్యత్తు గురించి చర్చిస్తారు అంటున్నారు.బీజేపీ నేతగా కిషన్ రెడ్డి మీద ఏపీ జనాలకు మంచి అభిప్రాయం ఉంది. ఆయన వ్యవహారశైలి కూడా ఆకట్టుకునేలా ఉంటుంది. పరుష పదజాలంతో విమర్శలు చేయడం ఆయన నైజం కాదు. వెంకయ్యానాయుడు తరహాలోనే ఆయన సుతిమెత్తగా కామెంట్స్ చేస్తారు. ఆయన ఇప్పటిదాకా జగన్ సర్కార్ మీద విమర్శలు చేయడం కంటే సలహాలు సూచనలే ఇస్తూ వచ్చారు. ఇక ఆయన టూరిజం మినిస్టర్ గా ఉన్నారు. ఏపీలో విశాఖ సహా చాలా టూరిజం స్పాట్స్ ఉన్నాయి. గతంలో ప్రతిపాదించి ఆచరణకు నోచుకోని ఎన్నో ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో కొన్ని అయినా కిషన్ రెడ్డి తన హయాంలో పట్టాలెక్కిస్తే ఏపీ జనాలు బీజేపీ వైపు చూసే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి ఆయన ఫేస్ వాల్యూ ఏపీ బీజేపీకి ఇపుడు అవసరంగా ఉంది. సామాజికవర్గం పరంగా చూసుకున్నా ఏపీ రాజకీయాల్లో కిషన్ రెడ్డి కొంత కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. చూడాలి మరి.

# కాకినాడ వీధివ్యాపారులకు కార్పోరేషన్ షెల్టర్లు నిర్మించాలి

**- పౌరసంక్షేమ సంఘం**

కాకినాడ సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)రోడ్లమీద దుమ్ము ధూళి నడుమ తోపుడుబండ్లు నిలబెట్టి ఈట్ స్ట్రీట్ గా ప్రచారం చేసుకుంటున్న స్మార్ట్ సిటీ అజెండా తీవ్ర అనారోగ్యకరంగా వుందని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోకన్వీనర్ చింతపల్లి అజయ్ కుమార్ పేర్కొన్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వ పాలకవర్గాలు శ్రద్ద వహించి స్మార్ట్ సిటీ నిధులతో వీధివ్యాపారు లకు ప్రభుత్వ మున్సి పల్ స్థలాల్లో షెల్టర్లు నిర్మించాలని కోరారు. ఎండుచేపల మ్మకునే వీధి వ్యాపారులకు జగన్నాధపురం వార్ఫ రోడ్డు లోని పోర్టుస్థలం నందు ఉప్పుటేరు పూర్వ ప్రాంగణంలో షెల్టర్ నిర్మించాలని ఏటిమోగ రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మించిన డ్రై ఫిష్ షెల్టర్ ను మినీ రైతుబజార్ గా మార్పు చేయడం వలన జగన్నాధపురం తూర్పు వైపు ప్రాంతాలకు ప్రజోపయోగంగా వుంటుందని పేర్కొ న్నారు. ఏటిమోగ రాజీవ్ గృహకల్పల వద్ద రొయ్యల ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతిం చడం వలన అక్కడి ప్రజలు నివాస ప్రాంతాల్లో ఇటువంటి గోడౌన్లు ప్రవేశపెట్టడం తగదని వాపోతున్న దుస్థితిని ఉన్నతాధికా రులు పరిశీలించి పేద ప్రజల ప్రభుత్వ గృహాల వద్ద పచ్చదనం పర్యావరణం ఆరోగ్యకర వాతావరణం పరిరక్షించాలని రమణ రాజు అజయ్ కుమార్ కోరారు

# జనసేన కార్యకర్తపై దాడి

విజయవాడ సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)ఆదమరిచి నిద్రిస్తున్న జనసైనికునిపై కర్రలతో దాడి జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకివచ్చింది. పవన్ కళ్యాణ్ అభిమానులు గురువారం రాత్రి జనసేన పార్టీ అధినేత పుట్టిన రోజు వేడుకలు అంగరంగ వైభవంగా అనాసాగరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కట్ అవుట్ ఏర్పాటుచేసారు. పుట్టినరోజు వేడుకల అనంతరం కటౌట్ ప్రక్కన పాములపాటి గోపి అనే జన సైనికుడు నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో గోపీని చితకబాదారు. జరిగిన సంఘటనపై జనసేన పార్టీ జిల్లా సెక్రెటరీ తోట మురళీకృష్ణ విచారం వ్యక్తం చేసారు. తోట మురళీకృష్ణ మాట్లాడుతూ జనసేన కార్యకర్త పాములపాడు గోపి పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసినట్లు తెలుస్తోంది.కడప పులివెందుల ఫ్యాక్షన్ రాజకీయాలు అనాసాగరం వరకు తీసుకు వచ్చారు.రాష్ట్రాన్ని ఏదో చేద్దాం అని చెప్పి రౌడీయిజం చేస్తున్నారు. నిద్రపోతున్న కార్యకర్తపై దాడి చేయడం హేయమైన చర్య. పాములపాడు గోపి పై దాడి చేసిన విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. జరిగిన దాడిపై కృష్ణా జిల్లా ఎస్పీ తో మాట్లాడతానని పవన్ కళ్యాణ్ మాట ఇచ్చారు. త్వరలో అనాసాగరం రానున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. గాయపడిన గోపికి జనసేన అండగా ఉంటుంది. జరిగిన సంఘటనపై వెంటనే పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేయాలి. అలా కాని పక్షంలో ఉద్యమం చేపట్టి ఉధృతం చేస్తామని అన్నారు.

# చెట్లను గ్రామ ప్రజలు కాపాడుకోండి

నందికొట్కూరు నందికొట్కూరు నియోజకవర్గంలోని కొణిదేల.నాగటూరు రోడ్డుకిరువైపులా చెట్లు నాటడం జరిగిందని ఏ పీ ఓ.మంగమ్మ తెలిపారు.. శనివారం నాడు రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను పరిశీలించరు. వీరి వెంట టెక్నికల్ అసిస్టెంట్లు.. అమీనాబి. లక్ష్మి జ్యోతి.ఫీల్డ్ అసిస్టెంట్లు మాదిగ పెద్ద శేషన్న. హేమావతి దగ్గర ఉండి ఏపీవో మంగమ్మకు కు చూపించారు.. రోడ్డుకిరువైపులా దాదాపుగా నందికొట్కూరు రోడ్డు కు 800 మొక్కలు. ముచ్చుమర్రి రస్తావరకు మూడు వందల ముప్పై మొక్కలు నాటడం జరిగింది అని వీటిని సంరక్షించాలంటే ఇబ్బందితో కూడిన విషయం చాలా ఉందని నాటిన మొక్కలను గేదెలు. గొర్రెలు. మేకలు. పశువులు తినడమే కాకుండా తొక్కి పాడు చేస్తున్నాయన్నారు. అందువలన కొణిదెల. నాగటూర్ గ్రామాలకు చెందిన రైతులు. గ్రామ ప్రజలు. గ్రామ పెద్దలు ప్రతి ఒక్కరూ సహకరించి గ్రామంలో ఉన్నటువంటి పశువులు వేయకుండా జాగ్రత్తగా రోడ్ల వెంబడి తీసుకువెళ్లాలని పశువుల కాపరులకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కావున ప్రతి ఒక్కరు శ్రద్ధతో మొక్కలు బ్రతికించు కునేందుకు ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొణిదేల. నాగటూరు గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు గుర్తించి పశువుల కాపరులను అవగాహన కల్పించాలని ఏ పీ ఓ మంగమ్మ కోరారు. ప్రస్తుతం ప్రతిరోజు.. జోల్లుగంగమ్మ. బత్తుల సీతమ్మ. మొక్కలకు నీళ్లు పోయడం జరుగుతుందన్నారు.. ప్రతి ఒక్కరూ రోడ్డు వెంబడి ఉన్న ఆచెట్లు మా ఇంటి వద్ద ఉన్నాయనే సంకల్పంతో మొక్కలను పర్యవేక్షించి కాపాడాలని ఏ పీ ఓ మంగమ్మ విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మి జ్యోతి. అమీనాబి. ఫీల్డ్ అసిస్టెంట్లు హైమావతి. మాదిగ పెద్ద శేషన్న. ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# అక్రమ లేఅవుట్ల పై కఠిన చర్యలు తీసుకుంటాం


**ప్రతి లే అవుట్ వద్ద నుడా అప్రూవల్ నెంబరు డిస్ ప్లే చేయాలి**

**త్వరలో నుడా సంబంధించి నూతన యాప్**

**నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్**

నెల్లూరు సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్) అక్రమ లే అవుట్ లు వేసి ప్రజలను ఇబ్బంది పెట్టే రియల్ ఎస్టేట్ మాఫియా అగడాలు,నిబంధనలు గాలికి వదిలి ఇష్టనుసారం అపార్ట్ మెంట్స్ కట్టే బిల్డర్స్ ఆటలు సాగావని నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారక నాథ్ హెచ్చరించారు.నెల్లూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (నుడా)పరిధిలో లో ఉన్న అక్రమ లే ఔట్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని నుడా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నుడా పరిధిలో వేసే ప్రతి లే ఔట్ కి సంబంధించి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలన్నారు. కానీ కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదన్నారు. లేఅవుట్ వేసినప్పుడు ఖచ్చితంగా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. నుడా పరిధిలో ఉన్న ప్రతి లేఅవుట్ వద్ద తమ అప్రూవల్ కి సంబంధించి జారీచేసిన నెంబర్ ను డిస్ ప్లే చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల ప్రజలకు తాము కొనుగోలు చేయబోయే ప్లాట్లకు నుడా అనుమతి పొందని తెలుస్తుందన్నారు. అతి త్వరలో నుడా నుంచి నూతన యాప్ రాబోతున్నారు అందులో నుడా పరిధిలో ఉన్న అప్రూవల్ ఇచ్చిన లేఅవుట్ల సమగ్ర వివరాలు ఉంటాయన్నారు.

# నవనీత సేవలో భక్తులకు అవకాశం




**సెప్టెంబరు 13వ తేదీ నుండి భక్తులకు అందుబాటులోకి అగరబత్తులు**

**డయల్ యువర్ ఈవోలో టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి**

తిరుమల,మా ప్రతినిధి, సెప్టెంబర్ 04, దేశీయ గోవుల నుండి సేకరించిన పాల నుంచి పెరుగు తయారుచేసి, దాన్ని చిలికి వెన్న తయారుచేసి స్వామివారికి సమర్పించేందుకు ఉద్దేశించిన నవనీత సేవలో భక్తులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. సెప్టెంబరు 13వ తేదీ నుంచి ఏడు బ్రాండ్లతో పరిమళభరిత అగరబత్తులు భక్తులకు విక్రయం కోసం అందుబాటులోకి తెస్తామన్నారు. తిరుపతి టిటిడి పరిపాలన భవనంలో శనివారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ముందుగా టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఆ వివరాలు.సెప్టెంబరు 9న వరాహ జయంతి- సెప్టెంబరు 9న ఉదయం 11 నుండి 12 గంటల వరకు తిరుమలలో వరాహ జయంతి సందర్భంగా ఉత్సవమూర్తులకు అభిషేకం, మూలమూర్తికి ప్రోక్షణ నిర్వహిస్తాం.సెప్టెంబరు 19న అనంతపద్మనాభ వ్రతం- సెప్టెంబరు 19న అనంతపద్మనాభ వ్రతంను పురస్కరించుకొని ఉదయం శ్రీవారి ఆలయం నుండి చక్రతాళ్వారును ఊరేగింపుగా తీసుకువెళ్ళి స్వామి పుష్కరిణిలో ఏకాంతంగా చక్రస్నానం నిర్వహిస్తాం.హోలీ గ్రీన్ హిల్స్‌గా తిరుమల- తిరుమలలో వాహనాల కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా పవిత్రతను, పర్యావరణాన్ని కాపాడి హోలీ గ్రీన్ హిల్స్‌గా మార్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించాం. ఇందుకోసం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను వినియోగిస్తాం.- మొదటి దశలో 35 విద్యుత్ కార్లను(టాటా నెక్సాన్) తిరుమలలోని సీనియర్ అధికారులకు అందించాం. రెండో దశలో యాత్రికులకు ఉచిత బస్సులు ప్రారంభిస్తాం. తిరుమల-తిరుపతి మధ్య ఆర్‌టిసి విద్యుత్ బస్సులను నడిపే ప్రక్రియ తుది దశలో ఉంది. మూడో దశలో ట్యాక్సీలను విద్యుత్ వాహనాలుగా మార్పించే ప్రయత్నం చేస్తాం.డిఆర్‌డిఓ పర్యావరణ హిత లడ్డూ సంచులు- తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నాం. లడ్డూ ప్రసాదాల పంపిణీ కోసం బట్ట, జ్యూట్ సంచులు, గ్రీన్ మంత్ర సంస్థ పర్యావరణ హిత కవర్లు విక్రయిస్తున్నాం. ఇటీవల డిఆర్‌డిఓ సంస్థ సాంకేతిక పరిజ్ఞానంతో మొక్కజొన్న వ్యర్థాలతో తయారు చేసిన పర్యావరణ హిత సంచుల విక్రయాలు ప్రారంభించాం.శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో బాలాలయం- తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయ విమాన గోపురానికి వంద కిలోల బంగారంతో తాపడం పనులను సెప్టెంబరు 14న ప్రారంభిస్తున్నాం.- ఇందుకోసం సెప్టెంబరు 8 నుండి 13వ తేదీ వరకు బాలాలయ కార్యక్రమాలు నిర్వహిస్తాం. భక్తులకు యథావిధిగా మూలమూర్తి దర్శనం ఉంటుంది. స్వామివారి కైంకర్యాలు కల్యాణ మండపంలోని బాలాలయంలో నిర్వహిస్తారు.శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో ఐనా మహల్ పునఃప్రారంభం- శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో ఆధునీకరించిన ఐనా మహల్‌ను ఆగస్టు 22న పునఃప్రారంభించాం. ఇక్కడ రోజూ స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం.వర్చువల్ విధానంలో పవిత్రోత్సవాలు- తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో సెప్టెంబరు 18 నుండి 20వ తేదీ వరకు పవిత్రోత్సవాలు ఏకాంతంగా జరుగనున్నాయి. శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వర్చువల్ విధానంలో భక్తులు పాల్గొనేందుకు వీలుగా ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నాం.సెప్టెంబరు 13వ తేదీ నుండి భక్తులకు అందుబాటులోకి అగరబత్తులు- టిటిడి ఆలయాల్లో వినియోగించిన పుష్పాలతో పరిమళభరిత అగరబత్తులు తయారు చేస్తున్నాం. సెప్టెంబరు 13వ తేదీ నుండి ఏడు బ్రాండ్లను భక్తులకు విక్రయానికి అందుబాటులో ఉంచుతాం.డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంతో ఎంఓయు- వివిధ ఆలయాల్లో ఉపయోగించిన పూలతో స్వామి, అమ్మవార్ల ఫోటోలు, క్యాలెండర్లు, డ్రై ఫ్లవర్ మాలలు, తదితరాలు తయారు చేయడానికి డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంతో సెప్టెంబరు 13వ తేదీ ఎంఓయు కుదుర్చుకుంటాం. ఈ ఉత్పత్తులను త్వరలో అందుబాటులోకి తెస్తాం.

# కోడుమూరు పెట్రోల్ బంక్ లో మోసం

**పెట్రోల్, డీసెల్ పోయకున్న పోసినట్లు చూపిస్తున్న మీటర్**

**నష్టపోతున్న వినియోగదారులు**

కోడుమూరు సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్) కోడుమూరు పట్టణం కర్నూలు రోడ్ లో వున్న ఒక పెట్రోల్ బంక్ వల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. అక్కడ వినియోగదారులు పెట్రోల్, డీసెల్ పోయించున్నమని వినియోగదారులు భావిస్తే పప్పులో కాలేసినట్లే. ఆ పెట్రోల్ బంక్ లో వాహనదారులు మీటర్ చూస్తే పెట్రోల్, డీసెల్ తమ వాహనాలకు పోస్తూ మీటర్ రీడింగ్ చూపిస్తుంది. ఐతే అక్కడ మీటర్ రీడింగ్ మాత్రమే కనిపిస్తుంది. కానీ వాహనాల్లో పెట్రోల్, డీసెల్ పోసివుండదు. ముఖ్యంగా కార్లు,బస్సులు, లారీలు, ట్రాక్టర్లు ఇతర నాలుగు చక్రాల వాహనాల యజమానులు దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వ్యవహారం గత కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతుంది. తమ వాహనాల్లో పెట్రోల్, డీసెల్ వేసినారని భావించి వినియోగదారులు డబ్బు చెల్లించి పెట్రోల్ బంక్ నుండి బయట వచ్చి కొంత దూరం ప్రయాణించిన తర్వాత కానీ తాను మోసపోయానని గ్రహించలేక పోతున్నాడు. అక్కడ వుండే బాయ్ లు పెట్రోల్ పోసినట్లు మీటర్ రీడింగ్ చూపిస్తారు. కానీ పెట్రోల్ కానీ డీసెల్ కానీ వాహనాల్లో వుండదు. కావున వినియోగ దారులు పెట్రోల్ పోసేటప్పుడు కానీ డీసెల్ పోసేటప్పుడ్ కానీ వాహనాల నుండి కిందికి వచ్చి సరిచూసుకోండి. పెట్రోల్ పోస్తున్నరా లేదా అని పరిశీలించుకోవాలి. కావున సంభందిత అధికారులు ఆ పెట్రోల్ బంక్ పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పెన్నా వంతెన బ్రిడ్జి సింహపురి ప్రజలకు అందుబాటులోకి వచ్చేనా

**జనసేన నాయకులు ఆందోళన**

నెల్లూరు సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్) దశాబ్దాల దశాబ్దాల కాలంగా నత్తనడకన నడుస్తున్న నెల్లూరుకి ప్రతిష్టాత్మకమైన పెన్న వంతెన ఎక్కడ ల్యాండ్ అవుతుందో ఇప్పటికీ క్లారిటీ లేదు... అధికార జలవనరుల శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో పనులు కూడా పూర్తి చేయలేకపోతున్నారు. 71 సంవత్సరాలు మించిన వంతెన మీద ఇప్పటికీ రాకపోకలు నగరానికి జరుగుతున్నాయి 100 కోట్లు నిర్మాణంతో కొత్త వంతెన లో వేసే ప్రతిపాదనలు ఆయనకే తెలియాలి జనసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గం వచ్చిన సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మరియు సిటీ నాయకులు సుజయ్ బాబు ఆధ్వర్యంలో పెన్నా వంతెన ను సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005 లో ప్రారంభమైన పెద్ద వంతెన కాంగ్రెస్ టిడిపి హయాంలో మారుతూ వచ్చిన ఇప్పటివరకూ శంకుస్థాపనకు నోచుకోలేదని దశాబ్దాలు గడుస్తున్నా ఆ పార్టీ ఎక్కడ ల్యాండ్ అవుతుందో కూడా ఇప్పటికీ ఒక అవగాహన లేకుండా పోయిందని ఈ మధ్య ఈ మధ్య కొత్తగా ప్రతిపాదనలు తెచ్చిన కొత్త వంతెన బ్రిడ్జి ఎటుపోయిందో 71 సంవత్సరాలుగా ఎన్నో మరమ్మతులకు గురై సిటీకి ఉన్న ఒకే ఒక కనెక్షన్ వంతెన ఏదైనా ప్రమాదాలకు గురి అయితే దానికి కారణం ఎవరని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గంటా స్వరూప,విజయ్ శేఖర్ కొట్టే వెంకటేశ్వర్లు,కత్తి తిరుమల జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నగర నాయకులు సుజయ్ బాబు కార్యదర్శులు ప్రశాంత్ గౌ డ్,పూసల మల్లేశ్వరరావు, కత్తి తిరుమల తో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# కడప - మాచనూరు బస్సు సర్వీసు ప్రారంభం

కడప, సెప్టెంబర్ 4 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆదేశాలతో కడప - మాచనూరు వయా గోపరాజుపల్లి మధ్య తిరిగే బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు నేటి నుంచి పునరుద్ధరించారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒకటిన్నరకు కడప నుండి బయలుదేరే ఈ బస్సు 2.45 గంటలకు గోపరాజుపల్లి చేరుకుంటుంది. గోపరాజుపల్లిలో 3 గంటలకు బయలుదేరి కడపకు 4.15 గంటలకు చేరుతుంది. 4.30కు కడపలో బయలుదేరి మాచనూరికి 6 గంటలకు, 6.15కు మాచనూరులో బయలుదేరి కడపకు 7.30కు చేరుతుంది. రాత్రి కడపలో 7.45కు బయలుదేరే ఈ బస్సు రాత్రి 9.15 మాచనూరు చేరి రాత్రికి అక్కడే హాల్ట్ అవుతుంది. తిరిగి మరుసటిరోజు ఉదయం 6.30కు బయలుదేరి 8 గంటలకు కడప చేరుతుంది. 8.15కు కడప విడిచి 9.30కు గోపరాజుపల్లి చేరుతుంది. చివరిగా 9.40కు గోపరాజుపల్లిలో బయలుదేరి 11 గంటలకు కడప చేరుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి కోరారు. తమ గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధచడం పై మాచనూరు, గోపారాజుపల్లితో పాటు ఆయా గ్రామాల ప్రజలు మల్లికార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# యడవల్లి రైతుల భూములు వారికే దక్కాలి

గుంటూరు సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్) గుంటూరు జిల్లా చిలకలూరిపేట రూరల్ మండలంలోని యడవల్లిలో ఎస్సీ, ఎస్టీ రైతుల భూములను ప్రభుత్వం తీసుకోవాలని భావిస్తున్న నేపథ్యంలో బాధిత రైతుల పక్షాన సిపిసిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మదు నిలిచారు.ఈ క్రమంలో బాధితులకు మద్దతుగా, భూములు వారికే దక్కేలా చూడాలని సిపిఎం తొలి నుండీ డిమాండ్ చేస్తున్నారు.ఇందులో భాగంగా గ్రామానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మదు పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# తహసిల్దార్ పై దాడి

విజయనగరం సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్) విజయనగరం జిల్లా మక్కువ మండల తహసీల్దార్ దొడ్డి వీరభద్రరావు పై ములక్కాయ వలస గ్రామానికి చెందిన కొందరు దాడికి చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ములక్కాయవలసలో తహసీల్దార్ పై దాడివిజయనగరం జిల్లా మక్కువ మండల తహసీల్దార్ దొడ్డి వీరభద్రరావు పై ములక్కాయ వలసగ్రామానికి చెందిన కొందరు దాడికి చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మక్కువ మండలం ములక్కాయ వలస గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ చేసేందుకు 18 ఎకరాల భూమిని అధికారులు ఎంపిక చేశారు. అయితే ఆ భూమిని చాలా కాలంగా సాగు చేస్తున్నామని గ్రామానికి సాలాపు కొటేశ్వరరావు కుటుంబీకులు తెలిపారు. ఈనెల 1 న ఆ భూమిలో కోటేశ్వరరావు కుటుంబీకులు వ్యవసాయ పనులు చేస్తున్నట్లు తహసీల్దార్ వీరభద్రరావుకు సమాచారం వచ్చింది.పనులు నిలిపివేయాలని వారిని ఆదేశించారు. అయితే ఈ భూమి పైకి రావద్దని వెళ్లిపోవాలని వారు హెచ్చరించారు. తహసీల్దార్ పొలంలో వేసిన కంచె తీసేందుకు ప్రయత్నించగా ఆయనపై దాడి చేశారు. ఈనెల 2న తహసీల్దార్.. మక్కువ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే కోటేశ్వరరావు కుటుంబీకులు 18 ఏళ్ల నుంచి ఆ భూమిని లీజుకు తీసుకోని సాగు చేస్తున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా వీరు సాగు చేస్తున్న భూమిని డీ పట్టా భూమిగా గుర్తించారు. శుక్రవారం సీఆర్పీఎఫ్ పోలీసులు సమక్షంలో ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. తమకు న్యాయం చేయాలని రైతు కుటుంబం పార్వతీపురం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు.

# చంద్రగిరిలో వరదలు

చిత్తూరు సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా చంద్రగిరిలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువున కురుస్తున్న వర్షాలకు పులిచర్ల, భీమవరం మార్గంలో కల్వర్టు కొట్టుకుపోయాయి. పుంగనూరు టీడీపీ ఇన్చార్జ్ అనీషా రెడ్డి కారు వాగులో కొట్టుకుపోయింది. ప్రమాద సమయంలో డ్రైవర్ తప్ప మరెవ్వరూ కారులో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇస్టనోల బాయి వద్ద వరద నీరు పోటెత్తడంతో కల్వర్టు కొట్టుకుపోయింది. అలాగే ధనిగుండు ప్రాంతంలో కూడా రోడ్డు కొట్టుకుపోవడంతోచంద్రగిరి నుంచి భీమవరం మీదుగా పులిచర్లకు వెళ్ళే ప్రధాన మార్గం కావడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ బస్సులు వెనుదిరుగుతున్నారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# లక్షలాది పెన్షన్లు రద్దు రద్దయ్యాయి

రాజమండ్రి సెప్టెంబర్ 4, (న్యూస్ పల్స్)తెలుగు దేశం పార్టీలో లోటుపాట్లను చంద్రబాబుకు రాతపూర్వకంగా ఇచ్చాను. ఇతర ప్రతిపక్షాలను కూడా కలుపుకోవాలని సూచించానని టి.డి.పి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు. జగన్ ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదార్లకు చుక్కలు చూపిస్తోంది. లక్షలాది మంది బడుగు, బలహీన వర్గాలు పింఛన్లు తొలగిస్తున్నారని అయన అన్నారు. ప్రతిపక్ష నేతగా జగన్ చేసిన తప్పుడు ప్రచారం వల్లే కేంద్రం పోలవరం అంచనాలు 55వేల కోట్లకు కేంద్రం అంగీకరించ లేదు. పోలవరం నిర్వాసితుల ఇళ్లకు 25 రకాల సౌకర్యాలు కల్పిస్తామనీ రెండు సౌకర్యాలు కూడా ఇవ్వలేదు. రెండేళ్లలో 9వేల కోట్ల రూపాయలు అదనంగా విద్యుత్ ఛార్జీలు ప్రజల నుంచి వసూలు చేశారు. ప్రతిపక్షాల తప్పుడు కేసుల విధానం మానకపోతే డి.జి.పి మూల్యం చెల్లించుకోక తప్పదని అయన అన్నారు.

# చదువుకోవాల్సిన చిన్నారులు..

**బడిపంతులకు వెట్టిచాకిరి...**

నందికొట్కూరు సెప్టెంబర్ 4 రాష్ట్ర మన ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరు పేద విద్యార్థుల కోసం. అమ్మ ఒడి. విద్యా దీవెన.. వసతి దీవెన. రెండు జతల బట్టలు.. అదే విధముగా వారికి అవసరం ఉందని నోట్ బుక్స్. ఇవ్వడం జరుగుతుంది. ఉపాధ్యాయులకు మాత్రం వేలకొద్దీ వేలు జీతాలు తీసుకుంటూ కక్కుర్తి పాల్పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని పెద్ద పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగాలు చేసి వారి కాళ్లపై వాళ్ళు నిలబడి తల్లిదండ్రులకు తోడుగా ఉంటారని వారికి ఇంటి వద్ద ఎలాంటి పనులు చెప్పకుండా కాస్తోకూస్తో ఇంట్లో వండీన తిండి వారికి తినిపించి చి బడికి సాగనంపుతారు.. అక్కడ స్కూల్ క్లాస్ గదిలో చదువుకోవాల్సిన విద్యార్థులు .. ఉపాధ్యాయుల క్యారియర్లు కడగడం.. వారి బైకులు తుడవడం.. వారు తెచ్చుకున్న కార్లు.. బైకులు నీటితో శుభ్రంగా కడిగించుకొవడం. సమయం ఉంటే చీపురుతో ఊడిపీయడం చేయిస్తుంటారు.. వేలకొద్దీ జీతాలు తీసుకుంటూ ఉండి కూడా చిన్నారి విద్యార్థులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం ఆనవాయితీగా మారిపోయింది.. ఇందుకు నిదర్శనం నందికొట్కూరు నియోజకవర్గం లోని నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణములో ప్రధాన ఉపాధ్యాయుల వాహనాన్ని ఒక స్కూల్ విద్యార్థి నీటి పైపు తో శుభ్రం చేస్తూకనిపించడం జరిగింది. అప్పుడేరోడ్డు వెంట వెళ్తున్నటువంటి గ్రామ ప్రజలు విద్యార్థులతో ఉపాధ్యాయులు వెట్టిచాకిరి చేయిస్తున్నారని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మండల విద్యాధికారి. లేదా జిల్లా ఉన్నతాధికారులు ఇలాంటి తప్పిదాలు జరగకుండా పిల్లలతో వెట్టిచాకిరి చేయించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నంద్యాల పట్టణంలో వార్డ్ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

నంద్యాల సెప్టెంబర్ 4:-( విభారె) నంద్యాల పట్టణంలో ఆకస్మికంగా వార్డ్ సచివాలయాలు తనిఖీ చేసిన నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్.శనివారం నంద్యాల పట్టణంలోని జ్ఞానాపురం లోని 33 వ వార్డు సచివాలయం.ములసాగరం లోని31 వ వార్డు లోని సచివాలయంను విజయపూరి కాలనీ లోని 28 వ వార్డు సచివలయము వెంకటాచలం కాలనీ లోని 34 వ వార్డు సచివలయము ను నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ . ఆకస్మికంగా తనిఖీ గావించారు.నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువు లోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, ప్రభుత్వ పథకాల పోస్టర్ లు తదితర వాటిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటి వరకు సచివాలయానికి ఎన్ని సర్వీసులు వచ్చాయి, ఎన్ని సర్వీసులకు పరిష్కారం చూపించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో ఎంత మంది జనాభా ఉన్నారు, అందులో ఎంత మంది పురుషులు...మహిళలు... పిల్లలు...ఉన్నారు...ఎంత మందికి పెన్షన్ వస్తుంది, తదితర వివరాలన్ని తమ దగ్గర ఉండాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. సచివాలయంలో పరిధిలో ఎంత మందికి వ్యాక్సిన్ ఇచ్చారు...45 సంవత్సరాల పైబడిన వారు ఎంత మంది పురుషులు, మహిళలు ఉన్నారు... వారిలో ఎంత మందికి మొదటి డోస్ వ్యాక్సిన్ ఇచ్చారు... ఇంకా రెండవ డోస్ ఎంత మంది వేయించుకోవాలి వంటి వివరాలను ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నరు. గర్భిణీలకు వ్యాక్సినేషన్ ఇవ్వడం చాలా అవసరమని...ఆ దిశగా మీ పరిధిలోని గర్భిణీలను మోటివేషన్ చేసి వ్యాక్సినేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని ఏఎన్ ఎంకు సబ్ కలెక్టర్ ఆదేశించారు.తమ వార్డ్ పరిధిలోని మహిళలకు దిశా యాప్ పై అవగాహన కల్పించాలని మహిళా పోలీస్ ను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఉన్న ఊర్లో ఉద్యోగం చేసే అవకాశం వచ్చిందని....మీ పట్టణం లో ఉన్న ప్రజలకు మంచి సేవలు అందించి ప్రజల నుంచి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రజల దగ్గరగా ఉంటూ మెరుగైన సేవలు అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే సర్వీసులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపించాలని సబ్ కలెక్టర్ వార్డ్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ప్రజలకు జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ అనేది చాలా కీలకమన్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డలకు ఆరోగ్య భద్రత

తుగ్గలి సెప్టెంబర్ 4:-( విభారె) : మండల పరిధిలోని ఉప్పర్లపల్లె మరియు ఎర్రగుడి గ్రామ సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాలలో శనివారం రోజున ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్ని గ్రామాలు పర్యటించడం జరిగింది.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ విజయ లక్ష్మి మాట్లాడుతూ గర్భవతులు మరియు బాలింతలకు,చిన్న పిల్లలకు జగనన్న కానుకలైన పాలు,గ్రుడ్లు,చిక్కిలు మరియు మొదలగు పౌష్టికాహారం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడం జరిగింది.

# రాష్ట్ర ప్రభుత్వం అవ్వ,తాత ల పింఛన్ లలో విధిస్తున్న నూతన నిబంధనలు వెంటనే ఎత్తివేయాలి



## అధికారంలోకి రాగానే నిబంధనలు పేరుతో నడిరోడ్డుపై అవ్వ,తాతలను వదిలేయడం సమనజసమే నాబీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకిరి.రామచంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శి షేక్.రియాజ్ డిమాండ్

నంద్యాలసెప్టెంబర్ 4:-( విభారె) :నంద్యాల పట్టణంలో శనివారం నాడు విలేకరుల సమావేశంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకిరి.రామచంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శి షేక్.రియాజ్ వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక నిబంధనల సాకుతో రాష్ట్రంలో ఉన్నటువంటి పెన్షన్ దారులను తీసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ,కంకణం కట్టుకుందని, గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో అవ్వ,తాతలకు నేనున్నా భరోసా అంటూ హామీ ఇచ్చి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన నిబంధనలు తీసుకొచ్చి అవ్వ,తాతల పింఛన్లు తీసివేసే విధంగా తయారయ్యారని, అవ్వ,తాతలు వారి ఆరోగ్య పరిస్థితి బాగా లేక, హాస్పిటల్లో మరియు వేరే,వేరే చోట్ల ఉండడం జరుగుతుందని, వాళ్లు రెండు నెలలకో సారి మూడు నెలలకోసారి ఒకే సారి వచ్చి పెన్షన్ తీసుకోవడం జరుగుతుందని, ఈ విధానాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసినటువంటి అనాలోచిత నిర్ణయం వల్ల అనేకమంది కొడుకులు బిడ్డలు లేని అవ్వ,తాతలు వాళ్ళ పింఛన్లు కోల్పోతున్నారని, ఇలా కొత్త నిబంధనలు తీసుకురావడం వల్ల అనాథలుగా మారిన అవ్వ,తాతలు వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆసరా కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అవ్వ,తాతల పింఛన్ల విషయంలో విడుదల చేసిన నూతన విధానాన్ని రద్దు చేయకపోతే భారీ ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడుతామని వారు రాష్ట్ర ప్రభుత్వనికి హెచ్చరిక తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గడివేముల మండల అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మం,చెర్రీ సుబ్బు తదితరులు పాల్గొన్నారు

## నాగటూరు...కొణిదేల.. రోడ్డు ఇరువైపులా

# చెట్లను గ్రామ ప్రజలు కాపాడుకోండి...మంగమ్మ



నందికొట్కూరు సెప్టెంబర్ 4:-( విభారె) నందికొట్కూరు నియోజకవర్గంలోని కొణిదేల.నాగటూరు రోడ్డుకిరువైపులా చెట్లు నాటడం జరిగిందని ఏ పీ ఓ.మంగమ్మ తెలిపారు.. శనివారం నాడు రోడ్డుకు ఇరువైపులా నాటిన చెట్లను పరిశీలించరు. వీరి వెంట టెక్నికల్ అసిస్టెంట్లు.. అమీనాబి. లక్ష్మి జ్యోతి.ఫీల్డ్ అసిస్టెంట్లు మాదిగ పెద్ద శేషన్న. హేమావతి దగ్గర ఉండి ఏపీవో మంగమ్మకు కు చూపించారు.. రోడ్డుకిరువైపులా దాదాపుగా నందికొట్కూరు రోడ్డు కు 800 మొక్కలు. ముచ్చుమర్రి రస్తావరకు మూడు వందల ముప్పై మొక్కలు నాటడం జరిగింది అని వీటిని సంరక్షించాలంటే ఇబ్బందితో కూడిన విషయం చాలా ఉందని నాటిన మొక్కలను గేదెలు. గొర్రెలు. మేకలు. పశువులు తినడమే కాకుండా తొక్కి పాడు చేస్తున్నాయన్నారు. అందువలన కొణిదెల. నాగటూర్ గ్రామాలకు చెందిన రైతులు. గ్రామ ప్రజలు. గ్రామ పెద్దలు ప్రతి ఒక్కరూ సహకరించి గ్రామంలో ఉన్నటువంటి పశువులు వేయకుండా జాగ్రత్తగా రోడ్ల వెంబడి తీసుకువెళ్లాలని పశువుల కాపరులకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కావున ప్రతి ఒక్కరు శ్రద్ధతో మొక్కలు బ్రతికించు కునేందుకు ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొణిదేల. నాగటూరు గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు గుర్తించి పశువుల కాపరులను అవగాహన కల్పించాలని ఏ పీ ఓ మంగమ్మ కోరారు. ప్రస్తుతం ప్రతిరోజు.. జోల్లుగంగమ్మ. బత్తుల సీతమ్మ. మొక్కలకు నీళ్లు పోయడం జరుగుతుందన్నారు.. ప్రతి ఒక్కరూ రోడ్డు వెంబడి ఉన్న ఆచెట్లు మా ఇంటి వద్ద ఉన్నాయనే సంకల్పంతో మొక్కలను పర్యవేక్షించి కాపాడాలని ఏ పీ ఓ మంగమ్మ విజ్ఞప్తి చేశారు..

# జానపద సాంస్కృతిక రాష్ట్ర డైరెక్టర్ గా పుష్పవతి ఎన్నిక

తుగ్గలి సెప్టెంబర్ 4:-( విభారె) : జానపద సాంస్కృతిక రాష్ట్ర డైరెక్టర్ గా రాతన గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు విజయ్ మోహన్ రెడ్డి సతీమణి పుష్పవతి ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా వైయస్సార్ సిపి నాయకులు విజయ మోహన్ రెడ్డి,ఉమా మహేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ డైరెక్టర్ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీదేవి కు వారు కృతజ్ఞతలు తెలియజేసారు.పార్టీ కొరకు కృషి చేసే వారికి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారు తెలియజేసాయు.జానపద సాంస్కృతిక రాష్ట్ర డైరెక్టర్ గా పుష్పవతి ను ఎన్నిక చేసినందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కు మరియు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కు రుణపడి ఉంటూ,పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని వారు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 6 న (సోమవారం) సబ్ కలెక్టర్ కార్యాలయంలో "స్పందన కార్యక్రమం

## మాస్కులు తప్పనిసరిగా ధరించి రావలెను సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పేయ్

నంద్యాల సెప్టెంబర్ 4:-( విభారె) : శనివారం నాడు ఓ ప్రకటనలో సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పేయ్ మాట్లాడుతూ సోమవారం నాడు సబ్ కలెక్టర్ కార్యాలయం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డివిజన్ లోని ప్రజలు సద్వినియోగం చేసుకోండి అని అన్నారు . ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సెప్టెంబర్ 6 "స్పందన" కార్యక్రమాన్ని (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నంద్యా సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. కోవిడ్ నేపథ్యంలో అర్జీదారులు స్పందన కార్యక్రమానికి తప్పకుండా మాస్కులు ధరించి హాజరు కావాలని, తమ అర్జీలను సమర్పించాలని సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. డివిజన్ లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# కింగ్ ఖాన్ షారుక్ సరసన నయన్- ప్రియమణి!



సీనియర్ నటి ప్రియమణి ట్యాలెంట్ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగ..తమిళ్..కన్నడ..మలయాళంలో ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించింది. ఎన్నో డిఫరెంట్ పాత్రల్లో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. టాలీవుడ్ లో 'పెళ్లైన కొత్తలో' చిత్రంతో లైమ్ లైట్ లోకి వచ్చిన ప్రియమణి అటుపై చాలా చిత్రాల్లో నటించింది. యమదొంగ చిత్రంతో జాతీయ అవార్డును అందుకుంది. 'రక్త చరిత్ర'...'నారప్ప'లాంటి చిత్రాలు ప్రియమణికి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చాయి. ఈ అందాల నటి బుల్లి తెరపైనా తన మార్క్ వేసింది. వెబ్ సిరీస్ లు..బుల్లి తెర రియాల్టీ షోల్లోనూ చురుకుగా పాల్గొని అన్నిచోట్లా తానున్నానని ఏదీ తక్కువ కాదని నిరూపించింది. అటు బుల్లి తెరను ఏలుతూనే సినిమాలు చేస్తోన్న ఏకైక నటి కూడా ప్రియమణి.'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ తో సౌత్ తో పాటు అటు ఉత్తరాదినా పేరొచ్చింది. అయితే కెరీర్ పరంగా ఎలాంటి రిమార్కులు లేనప్పటికీ ప్రియమణిని ఎందుకనో బాలీవుడ్ తొలి నుంచి చిన్న చూపే చూసింది. అవకాశాలిస్తామని చెప్పిన బడా స్టార్లు ఆ తర్వాత ముఖం చాటేసారు. ఓ సినిమాలో సల్మాన్ ఖాన్ అవకాశం ఇస్తానని ఇంట్రెస్ట్ చూపించాడు. కానీ చివరి నిమిషంలో ఆ ఛాన్స్ మరో హీరోయిన్ కి వెళ్లిపోయింది. ఇంకా పలువురు బాలీవుడ్ హీరోలు..దర్శకనిర్మాతల తో ఆ రకమైన భంగపాటు తప్పలేదు. ఈ నేపథ్యంలో ఓ బిగ్ ఛాన్స్ తో ప్రియమణి పడి లేచిన కెరటంలా పైకి లేచింది. రాజ్ అండ్ డీకే ఫ్యామిలీమ్యాన్ రెండు సీజన్లలోనూ ప్రియమణి నటనకు మంచి గుర్తింపు దక్కింది. జాతీయ అవార్డునటి ఇప్పుడు గ్లోబల్ స్టార్ గా వెలిగిపోతోంది.భంగపడిన చోటే ఇప్పుడు తిరిగి ప్రియమణి అవకాశాలు అందుకుంటోంది. బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ కథానాయకుడిగా కోలీవుడ్ దర్శకుడు అట్లీ ఓ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా నేడు పూణేలో ప్రారంభమైంది. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తుండగా. మరో కీలక పాత్రకు ప్రియమణిని ఎంపిక చేసాడు అట్లీ. ప్రియమణి షూటింగ్ నిమిత్తం ముందుగానే పూణే చేరుకుందని తెలుస్తోంది. షారుక్..నయన్..ప్రియమణి పై ఈ షెడ్యూల్ లో కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారుట. షెడ్యూల్ మొత్తం పూర్తయ్యే వరకూ ప్రియమణి పూణేలో నే ఉంటుందని యూనిట్ వర్గాల సమాచారం.దీన్ని బట్టి ప్రియమణి షారుక్ సరసన సెకెండ్ లీడ్ లో కనిపిస్తుందా? అంటూ ప్రచారం సాగుతోంది. ఈ చిత్రాన్ని షారుక్- అట్లీ పాన్ ఇండియా కేటగిరీలో రిలీజ్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సౌత్ లో పేరున్న నటుల్ని కూడా ఈ ప్రాజెక్ట్ లో భాగం చేయాలని ఈ జోడీ భావిస్తోందిట. ఇప్పటికే బాలీవుడ్ నటుల ఎంపిక పూర్తయిన నేపథ్యంలో సౌత్ స్టార్ ల ఎంపికపై పడినట్లు గుసగుస వినిపిస్తోంది.నిజానికి అందాల నయనతార సౌత్ అగ్ర నాయికగా కొనసాగుతున్న తొలి రోజుల్లోనే బాలీవుడ్ నుంచి ఇబ్బడిముబ్బడిగా అవకాశాలొచ్చాయి. కానీ ఎందుకనో తొలి నుంచి బాలీవుడ్ పై నయన్ విముఖంగానే ఉంది. మరోవైపు సౌత్ లో తన స్టార్ డమ్ ని వదులుకుని ఇతర భాషలకు వెళ్లే ఆలోచన కూడా నయన్ ఏనాడూ చేయలేదు. ఇక్కడ అగ్ర హీరోల సరసన నటించేందుకు స్థానికంగా కమ్యూనికేషన్ కోసమే శ్రద్ధ కనబరిచారు. ఇన్నాళ్టికి బాలీవుడ్ లో నయన్ ఓ సినిమా చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మరోవైపు ప్రియమణి బాలీవుడ్ లో నటించినా చాలా గ్యాప్ తర్వాత క్రేజీగా షారూక్ సినిమాలో ఛాన్స్ దక్కించుకోవడంపైనా అభిమానులు ఆసక్తిగా ముచ్చటించుకుంటున్నారు.

# కామన్ ఫ్రెండ్ తో పీవీ సింధు- హన్సిక అల్లరి!



ఆపిల్ బ్యూటీ హన్సిక మంచు ఫ్యామిలీకి క్లోజ్ అన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ లో ఉన్న క్లోజ్ ఫ్రెండ్ మంచు విష్ణు. తెలుగు అగ్ర హీరోల సరసన నటించిన హన్సిక విష్ణు తో బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే కుటుంబ స్నేహితులుగా కొనసాగుతున్నారు. మంచు హీరోతో తన స్నేహంపై చాలా సందర్భంలో బాహాటంగానే వెల్లడించింది హన్సిక. 'దేనికైనా రెడీ'..'పాండవులు పాండవులు తుమ్మెద'..'లక్కున్నోడు' చిత్రాల్లో ఆ ఇద్దరు జంటగా నటించారు. విష్ణు సొంత బ్యానర్ సినిమాల్లో హన్సిక నటించింది. హన్సిక ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా మంచు విష్ణుని విరోనికాను తప్పక కలుస్తారు. ఆ స్నేహానుబంధం కొనసాగుతోంది.అలాగే బ్యాడ్మింటన్ స్టార్ పి.వి సింధు కి మంచు ఫ్యామిలీతో ఎప్పటి నుంచో క్లోజ్ అసోసియేషన్ ఉంది. మరి ఈ ముగ్గురి ఒకే చోట చేరితే ఎలా ఉంటుందో? చెప్పాల్సిన పనిలేదు. ఇటీవల వీరంతా గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. హన్సిక.. పి.వి.సింధు.. విష్ణు.. అతడి సతీమణి విరోనిక ఒకే చోట కలిసి చిలౌట్ అయ్యారు. ఈ ఫోటోని మంచు విష్ణు సోషల్ మీడియా వేదికగా షేర్ చేసారు. ఈ ఫోటోని ఉద్దేశించి హన్సిక 'ఉయ్ ఆర్ క్యూట్' అని కామెంట్ చేయగా..పి.వి సింధు 'లవ్ దిస్' అని కామెంట్ చేయగా.. 'మంకీ బిజినెస్' అంటూ విష్ణు క్యాప్షన్ ఇచ్చారు.ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు ఫన్నీ ఎమోజీ లు.. కామెంట్లు పెడుతూ మరింత జోష్ పెంచుతున్నారు.

# మళ్లీ హిట్ అయిన జాతిరత్నం



నవీన్ పొలిశెట్టి హీరోగా ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా అనుదీప్ దర్శకత్వంలో మహానటి దర్శకుడు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన జాతిరత్నాలు కరోనా సమయంలోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఏడాది వచ్చిన హిట్ సినిమాల్లో జాతిరత్నాలు ఒకటి అనడంలో ఏమాత్రం సందేహం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీకి మంచి ఊపును ఇచ్చిన సినిమా అనడంలో కూడా ఏమాత్రం సందేహం లేదు. ఒక విభిన్నమైన కామెడీ ఎంటర్ టైనర్ గా రూపొందిన జాతి రత్నాలు సినిమా తాజాగా మరోసారి విజయాన్ని సొంతం చేసుకుంది.మొన్న ఆదివారం జాతిరత్నాలు సినిమా జెమిని టీవీలో టెలికాస్ట్ అయ్యింది. భారీ అంచనాల నడుమ జెమిని లో టెలికాస్ట్ అయిన జాతిరత్నాలు సినిమా థియేటర్ లో ఎలా అయితే సక్సెస్ అయ్యిందో బుల్లి తెరపై కూడా అదే తరహాలో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. జెమిని టీవీలో ఈ సినిమా కు గాను 10.2 టీఆర్పీ రేటింగ్ దక్కినట్లుగా సమాచారం అందుతోంది. ఈ స్థాయిలో పెద్ద సినిమాలు మాత్రమే రేటింగ్ ను దక్కించుకుంటాయి. జాతిరత్నాలు ఈ రేంజ్ లో రేటింగ్ దక్కించుకోవడం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.జాతిరత్నాలు సినిమా టీఆర్పీ రేటింగ్ తో జెమిని టీవీకి మంచి లాభాలు వచ్చినట్లుగా తెలుస్తోంది. అదే రోజు ఎన్టీఆర్ మరియు రామ్ చరణ్ లు సందడి చేసిన ఎవరు మీలో కోటీశ్వరులు కూడా టెలికాస్ట్ అయ్యింది. రెండు బ్యాక్ టు బ్యాక్ వచ్చాయి. ఎన్టీఆర్ షో కు కాస్త తక్కువగా జాతిరత్నాలు సినిమా రేటింగ్ దక్కించుకుంది. జాతిరత్నాలు దర్శకుడు అనుదీప్ ప్రస్తుతం పాన్ ఇండియా మూవీని తెరకెక్కిస్తున్నాడు. మరో వైపు జాతిరత్నాలు హీరో నవీన్ పొలిశెట్టి వరుసగా ఆఫర్లు దక్కించుకుంటున్నాడు.

# భారత షట్లర్ల హవా.. మరో 3 పతకాలు ఖాయం




టోక్యో: పారాలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో భారత్‌కు పతకాల పంట పండే అవకాశం ఉంది. అన్నీ అనుకూలిస్తే.. మూడు స్వర్ణాలు, మూడు కాంస్యాలు సొంతమవుతాయి. లేదంటే కనీసం మూడు రజత పతకాలు మాత్రం ఖాయం. పురుషుల బ్యాడ్మింటన్‌లో ప్రమోద్ భగత్, సుహాస్ యతిరాజ్, కృష్ణ నాగర్ పురుషుల సింగిల్స్‌లో తమ విభాగాల్లో ఫైనల్ చేరుకున్నారు. వీరు ముగ్గురు స్వర్ణం కోసం పోటీపడతారు. మనోజ్ సర్కార్, తరుణ్ ధిల్లాన్ సెమీస్‌లో ఓటమి పాలవ్వడంతో కాంస్యం కోసం పోరాడనున్నారు. అలాగే, మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో భగత్, పలక్ జోడీ కూడా సెమీస్‌లోనే వెనుదిరిగింది. దీంతో ఈ జోడీ కూడా కాంస్య పతక పోరులో నిలిచింది.కాగా, ప్రపంచ నంబర్ వన్ షట్లర్ ప్రమోద్ భగత్ సెమీస్‌లో అత్యంత సునాయాస విజయం అందుకున్నాడు. ఎస్ఎల్ 3 సెమీస్‌లో జపాన్ ఆటగాడు డైసుక్ ఫుజిహారాను 21-11, 21-16 తేడాతో వరుస గేముల్లో చిత్తు చేశాడు. అతడు స్వర్ణ పతక పోరులో గ్రేట్ బ్రిటన్ షట్లర్ డేనియెల్ బెథెల్‌తో పోటీపడనున్నాడు. ఎస్ఎల్ 4 విభాగంలో సుహాస్.. ఇండోనేసియా షట్లర్ సెతియవన్‌ను 21-9, 21-15 తేడాతో ఓడించాడు. సుహాస్ ఫైనల్లో టాప్‌సీడ్ లూకాస్ మజుర్ (ఫ్రాన్స్)తో తలపడనున్నాడు. ఇక, ఎస్‌హెచ్ 6 విభాగంలో కృష్ణ నాగర్.. సెమీస్‌లో బ్రిటన్ ఆటగాడు క్రిస్టీన్ కూంబ్స్‌ను 21-10, 21-11 తేడాతో మట్టికరిపించి ఫైనల్‌కు చేరాడు. స్వర్ణం కోసం పోరులో కృష్ణ.. హాంకాంగ్ షట్లర్ చు మన్ కైతో పోటీపడతాడు.ఇదిలా ఉంటే, ప్రస్తుత పారాలింపిక్స్‌లో ఇప్పటివరకు భారత్ 15 పతకాలు సాధించింది. వీటిలో మూడు పసిడి, ఏడు రజతం, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. టోక్యోకి బయల్దేరేముందు భారత పారాలింపిక్స్ ప్రతినిధులు కనీసం 15 పతకాలు సాధిస్తామని ఛాలెంజ్ చేసి మరీ విమానం ఎక్కారు. అన్న మాట ప్రకారమే భారత్ ఇప్పటికే 15 పతకాలు సాధించింది. ఈ సంఖ్య 25 దాటే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పారాలింపిక్స్ చరిత్రలో భారత్ ఈ స్థాయిలో పతకాలు సాధించడం ఇదే తొలిసారి. 2016 రియో పారాలింపిక్స్‌లో భారత్ సాధించిన 4(2 స్వర్ణం, రజతం, కాంస్యం) పతకాలే ఇప్పటిదాకా అత్యుత్తమం.

## ఫ్యాన్స్‌తో కలిసి కేక్ కట్ చేసిన షమీ.. వీడియో వైరల్

లండన్: టీమిండియా బౌలర్ మహ్మద్ షమీ శుక్రవారంతో(సెప్టెంబర్ 3) 31వ పడిలోకి అడుగుపెట్టాడు. ఈ సందర్భంగా షమీ తన జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నాడు. అయితే షమీకి నాలుగో టెస్టు టీమిండియా జట్టులో చోటు దక్కలేదు. అతని స్థానంలో శార్దూల్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చాడు. షమీ పుట్టినరోజు కావడంతో మ్యాచ్ చూడడానికి వచ్చిన ఒక భారత అభిమాని హ్యాపీ బర్త్‌డే షమీ అని రాసి ఉన్న టీషర్ట్ ధరించాడు.ఎలాగైనా షమీతో కేక్ కట్ చేయించాలని సదరు అభిమాని భావించాడు. అభిమాని కోరికను తెలుసుకున్న షమీ స్వయంగా వచ్చి కేక్ కట్ చేసి వారిని సంతోషపరిచాడు. షమీ కేక్ కటింగ్ చేస్తుండగా.. కొందరు అభిమానులు షమీ.. షమీ అంటూ స్టేడియాన్ని హోరెత్తించారు. కాగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో షమీ మొదటి మూడు టెస్టు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడు. ఓవరాల్‌గా షమీ టీమిండియా తరపున 54 టెస్టుల్లో 195 వికెట్లు, 79 వన్డేల్లో 145 వికెట్లు, 12 టీ20ల్లో 12 వికెట్లు తీశాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190